



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 173 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ సోమవారం 16 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-


## పుట్టా మహేష్‌పై ఆరోపణలు..

# సీఎం సీరియస్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబు.. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పుట్టా మహేశ్‌పై వచ్చిన ఆరోపణలను సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఇప్పటికే ఆయన్ను అధిష్ఠానం ఆదేశించింది. ఈ ఘటనపై మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదన్నారు. వ్యక్తులు, నేతల బలహీనతలు, తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వొద్దని చెప్పారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ మిగతా .. 2లో..

## అమరావతిలో అమరజీవి భారీ విగ్రహం

- 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు
- రేపు పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సోమవారం అమరావతి, విజయవాడలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన అమరజీవి పొట్టి శ్రీరాములు మిగతా .. 2లో..

వైద్య సాంకేతిక రంగం కోసం

## మెడ్‌టెక్ క్యాపిటల్ నిధి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత వైద్య సాంకేతిక రంగానికి చేయూతనిచ్చేందుకు వీలుగా ఏపీ మెడ్‌టెక్ జోన్, మెడ్‌ఆర్తా క్యాపిటల్ భాగస్వామ్యంతో ప్రత్యేక మెడ్‌టెక్ క్యాపిటల్ నిధిని ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ముంబయిలో ఫండ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఎంటీజెడ్ ఎండీ, వ్యవస్థాపక సీఈవో జితేంద్ర శర్మ, మెడ్‌ఆర్తా క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ గణేశ్, మెడ్‌టెక్ నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిగతా .. 2లో..

## ఆరోపణలను నమ్మొద్దు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ వివరణ



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మొయినాబాద్ డ్రగ్స్ ఘటనలో తనపై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ వివరణ ఇచ్చారు. తాను ఎలాంటి వ్యక్తినో ఏలూరు ప్రజలు, పార్టీ నేతలకు తెలుసన్నారు. తనకు ఎలాంటి దురలవాట్లు లేవని, ఏ తప్పు చేయలేదని తెలిపారు. " స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ ఫామ్‌హౌస్‌కు వెళ్లా. ఆ సమయంలో మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయి. ఆరోపణలను ఎవరూ మిగతా .. 2లో..

రాహుల్ గాంధీకి

## అది కూడా తెలియదా?

కేంద్ర మంత్రి అమిత్ షా



**విశ్వం వాయిస్ న్యూస్ :** భాజపా, ప్రధాని మోదీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. దేశాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు యత్నిస్తున్నారని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆయన చర్యలకు ఏ భారతీయుడూ మద్దతు ఇవ్వడని పేర్కొన్నారు. అస్సాం పర్యటనలో భాగంగా వైద్యారోగ్య రంగంలో రూ.2 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు కేంద్రమంత్రి ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు చేశారు. "అస్సాంలో కాంగ్రెస్ తన 15 ఏళ్ల పాలనలో వైద్యారోగ్య రంగానికి సంబంధించిన బడ్జెట్ నుంచి ఏటా రూ.150 కోట్లు కాజేసింది. ఆ సమయంలో ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆ పార్టీ కేవలం తమ నేతల కుటుంబాల ఆర్థిక ప్రయోజనాల కోసమే పనిచేసింది" అని అమిత్ షా మిగతా .. 2లో..

## విజయ్‌కి డిప్యూటీ సీఎం పోస్టు ఆఫర్..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో భాజపా, టీవీకే పార్టీల మధ్య పొత్తు విషయంలో మరోసారి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. పొత్తులో భాగంగా టీవీకే అధినేత విజయ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని భాజపా ఆఫర్ చేసిందని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీవీకేతో పొత్తుకు సంబంధించి చర్చలు తుది దశకు మిగతా .. 2లో..

అన్నవరం

## పరిసరాల్లో పులి

భక్తులను అప్రమత్తం చేసిన అధికారులు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలో 16 రోజులుగా పులి సంచరిస్తోంది. శంఖవరం, ఊర కొండ నుంచి అది వెనుదిరిగింది. శంఖవరం -కత్తిపూడి దాటి మండపం గ్రామ పొలాల వైపు వెళ్లింది. అన్నవరం క్షేత్రం పంపా రిజర్వాయర్ మార్గంలో వెళ్లినట్లు అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. పరిసర గ్రామాల మిగతా .. 2లో..

ప్రజా సేవకు పరితపించిన

## గొప్ప నేత ఎన్టీఆర్

### ఎమ్మెల్యే బండారును సత్కరించిన నారా భువనేశ్వరి

**విశ్వం వాయిస్ న్యూస్ :** బంజారాహిల్స్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ట్రస్ట్ 29వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాకుండా సేవలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. అవసరమైన విద్యార్థులకు విద్యా సహాయం, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజ సేవలో భాగంగా ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో



ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారిని నారా భువనేశ్వరి సత్కరించి మెమోటోను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మిగతా .. 2లో..

డ్రగ్స్ కేసులో నన్ను లాగితే..

## చట్టపరంగా నోటీసులిస్తా..

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సూచనను స్వీకరిస్తున్నానని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు డ్రగ్స్ వాడటం దురదృష్టకరమన్నారు. వ్యక్తిగతంగా డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానన్నారు. డ్రగ్స్ వాడకం, చట్ట విరుద్ధ కార్యకలాపాలను బీఆర్ఎస్ ఖండిస్తుందని చెప్పారు. డ్రగ్స్‌ను వినియోగించేది ఎంతటివారైనా శిక్షించాలని డిమాండ్ చేశారు. " రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు మిగతా .. 2లో..

కేంద్రం పరిశీలనలో

## విశాఖ మెట్రో ప్రాజెక్టు

మంత్రి నారాయణ



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ నగరాభివృద్ధికి హడ్కో సహకారం కీలకమని మంత్రి నారాయణ అన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తామన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్టును కేంద్రం పరిశీలిస్తోందని చెప్పారు. విశాఖ మెట్రోను 'రైడర్స్' సంస్థ అధ్యయనం మిగతా .. 2లో..

గురజాల జీడీసీసీ బ్యాంకులో

## రూ.11.66 కోట్ల అవినీతి

చీఫ్ మేనేజర్ సస్పెన్షన్




**గురజాల, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా గురజాలలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీ) శాఖలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అవినీతిపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసిన ఆరోపణల నేపథ్యంలో గురజాల చీఫ్ మేనేజర్ పున్నారావును సస్పెండ్ చేస్తూ.. జిల్లా కలెక్టర్, సహకార బ్యాంకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ కాలంలో నిబంధనలను పక్కనపెట్టి మిగతా .. 2లో..

## పశ్చిమాసియా సంక్షోభం..

సౌదీ, యూఏఈ నేతలకు జైశంకర్ ఫోన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై గత రెండు వారాలుగా అమెరికా, ఇజ్రాయెల్‌లు భీకర దాడులను కొనసాగిస్తున్నాయి. ప్రతీకారంగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశాంగ మంత్రులతో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది. ఇంధన భద్రతపైనే వీళ్లు ప్రధానంగా దృష్టి సారించినట్లు సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసి వేయడంతో వందలాది నౌకలు ఇరువైపులా నిలిచిపోయాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ ధరలు మిగతా .. 2లో..

## 'ఖర్గే'పై సరదాగా మరిన్ని దాడులు చేస్తాం : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక పక్క పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతుండగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ చమురుకు ఆయువుపట్టు లాంటి ఖర్గ్ ఐలాండ్‌పై సరదాగా మరిన్ని దాడులు చేస్తామంటూ పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఖర్గ్ ద్వీపంపై మరిన్ని దాడులు జరగొచ్చని ట్రంప్ అన్నారు. ఇప్పటికే తమ దళాలు జరిపిన దాడుల్లో అక్కడ చాలా భాగం ధ్వంసమైందన్నారు. కానీ, సరదాగా తాము మరికొన్నిసార్లు దాన్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఇరాన్ యుద్ధం మూడో వారానికి చేరుకుంది. ఖర్గ్‌లోని సైనిక స్థావరాలే

## నెతన్యాహు మరణంపై వార్తలు..

స్పందించిన ఇజ్రాయెల్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. యుద్ధంలో ఆయన ప్రాణాలు కోల్పోయారంటూ ప్రచారం జరుగుతోంది. శుక్రవారం నెతన్యాహు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసిన వీడియోనే ఈ ఊహాగానాలకు కారణం. తాజాగా ఆయన కార్యాలయం దీనిపై స్పందిస్తూ.. అవన్నీ ఫేక్ అని కొట్టిపారేసింది. అసలేం జరిగిందంటే..? ఇరాన్‌పై యుద్ధం గురించి నెతన్యాహు ఓ సమావేశంలో మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియోను ఇటీవల ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఆ వీడియోలో నెతన్యాహు చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు కన్పించింది. దానిని ఏఐ వీడియోగా నెటిజన్లు అభివర్ణించారు. ఈ క్రమంలో నెతన్యాహుకి ఏమైంది? అసలు ఆయన ప్రాణాలతో మిగతా .. 2లో..

తమిళనాడు, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు

## మోగిన నగారా




**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో నాలుగు రాష్ట్రాలతోపాటు ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తో పాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను వెల్లడించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం.. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## సీఎం సీరియస్

పుట్టా మహేశ్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు పాజిటివ్ వచ్చింది. మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తన ఫామ్‌హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వీకెండ్ పార్టీ ఏర్పాటు చేశారని.. దానికి పుట్టా మహేశ్ హాజరైనట్లు పోలీసు అధికారులు తెలిపారు.

**పుట్టా మహేశ్‌కు షోకాజ్ నోటీసులు**

ఎంపీ పుట్టా మహేశ్‌కు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మొయినాబాద్ డ్రగ్స్ ఘటనను పార్టీ సీరియస్‌గా తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై 5 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సమగ్ర నివేదిక వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. మహేశ్ ఇచ్చే వివరణ ఆధారంగా అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు.

## అమరావతిలో అమరజీవి భారీ విగ్రహం

భారీ విగ్రహావిష్కరణ, మరోవైపు రంజాన్ పవిత్రతను చాటుతూ ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఇచ్చే ఇఫ్తార్ విందులో సీఎం పాల్గొననున్నారు. ఉదయం 11:15 గంటలకు అమరావతిలో శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. అమరజీవి త్యాగానికి స్ఫూర్తిగా ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని రూ.150 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 6.80 ఎకరాల స్థలంలో మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం 6 నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు చేపట్టి 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను ఉపయోగించారు. రెండో దశలో ఇక్కడ మ్యూజియం, ఫోటో గ్యాలరీ, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మించనున్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు పోరాడిన శ్రీరాములు త్యాగాన్ని చాటిచెప్పేలా ఈ స్మృతీవనాన్ని తీర్చిదిద్దనున్నారు. సాయంత్రం 05:40 గంటలకు విజయవాడ చేరుకుని ముస్లిం సోదరుల గౌరవార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనారిటీలకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారితో కలిసి ఆయన ఇఫ్తార్ విందు స్వీకరిస్తారు.

**కావూరు కుటుంబ సభ్యులకు చంద్రబాబు పరామర్శ**

కేంద్ర మాజీ మంత్రి కావూరు సాంబశివరావు నీతి, నిజాయతీతో రాజకీయాలు చేశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడని గుర్తుచేశారు. అలాంటి నేతను కోల్పోవడం తీరని లోటని అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కావూరు నివాసంలో ఆయన కుటుంబ సభ్యుల్ని చంద్రబాబు పరామర్శించారు. కావూరు చిత్రపటానికి నివాళులర్పించారు. చంద్రబాబుతోపాటు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

**హెచ్‌జే దొర కుటుంబ సభ్యులకు పరామర్శ**

ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కుటుంబసభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. హైదరాబాద్‌లోని హెచ్‌జే దొర నివాసానికి వెళ్లి.. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలీసు విభాగంలో ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారని చంద్రబాబు అన్నారు. పోలీసు శాఖను ఉన్నత శిఖరాలపై నిలిపేందుకు కృషి చేశారన్నారు. రెండ్రోజుల క్రితం హెచ్‌జే దొర కన్నుమూసిన సంగతి తెలిసిందే.

## నెతన్యాహు మరణంపై వార్తలు..

ఉన్నారా? వంటి అనేక ప్రశ్నలను నెటిజన్లు లేవనెత్తారు.

యూఎస్ కన్జర్వేటివ్ వ్యాఖ్యాత కాండేస్ ఓవెన్స్ దీనిపై స్పందిస్తూ.. 'బీబీ ఎక్కడ? ఆయన కార్యాలయం ఎందుకు ఫేక్ ఏఐ వీడియోను విడుదల చేసింది. ఎందుకు తొలగించింది.? అమెరికా ప్రభుత్వం ఎందుకు ఆందోళనకు గురవుతోంది' అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మరికొందరు కూడా వీడియోలోని అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ పోస్టులు పెట్టారు. దీంతో ఇరాన్ దాడుల్లో ఆయన మృతి చెందారంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు కార్యాలయం వీటిపై స్పందిస్తూ.. ఆయన క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేసింది. దీంతో ఊహాగానాలన్నింటికీ చెక్ పడింది.

**నెతన్యాహుకు ఇరాన్ వార్నింగ్**

ఇరాన్‌కు చెందిన ఐఆర్జీసీ నెతన్యాహుకు హెచ్చరికలు చేసింది. పిల్లల ప్రాణాలు తీసే వ్యక్తిగా ఇజ్రాయెల్ ప్రధానిని అభివర్ణించింది. ఆయన ఇంకా బతికే ఉంటే.. శక్తి మేరకు వెంటాడతాం అని వ్యాఖ్యానించింది. ఆయన మరణంపై వస్తున్న వార్తలు ఫేక్ అని ఇజ్రాయెల్ పేర్కొన్న కొన్ని గంటల్లో ఐఆర్‌జీసీ ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. నెతన్యాహు బతికే ఉన్నారా అనే అంశం అస్పష్టంగానే ఉందని ఇరాన్ దళాలు పేర్కొన్నాయి. ఆయన మృతిచెంది ఉండొచ్చని లేదా కుటుంబంతో సహా దేశాన్ని వీడి ఉండొచ్చని తెలిపాయి.

**వైద్య సాంకేతిక రంగం కోసం**

## మెడ్‌టెక్ క్యాపిటల్ నిధి

గోయల్ మాట్లాడుతూ.. మెడ్‌టెక్ రంగంలో ఆవిష్కరణలు, అంకుర సంస్థలకు ఈ నిధి దోహదపడుతుందన్నారు. వైద్య పరికరాల ఆవిష్కరణ, పరిశోధన, తయారీ లక్ష్యంగా నిధిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## ఆరోపణలను నమ్మొద్దు

నమ్మొద్దు. పోలీసు విచారణకు సహకరిస్తా. పూర్తి వివరాలతో త్వరలో ప్రజలకు ముందుకు వస్తా" అని పుట్టా మహేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

## అన్నవరం పరిసరాల్లో పులి

ప్రజలను అప్రమత్తం చేశారు. అన్నవరం, తాళ్లపాలెం, మండపం, బెండపూడి వాసులను అధికారులు అప్రమత్తం చేశారు. పొలాల్లోకి వెళ్లిన రైతులు వెంటనే వెనక్కి రావాలని సూచించారు. పులి సంచారం హెచ్చరికలతో అన్నవరం దేవస్థానం, అటవీ, పోలీసు శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. కొండపై భక్తులు అప్రమత్తంగా ఉండాలని మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో ఒంటరిగా నడిచి వెళ్లొద్దని సూచించారు. ఘాట్ రోడ్డులో ఎక్కడా వాహనాలు నిలపవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వసతి గదుల్లో నుంచి రాత్రి వేళల్లో బయటకు రావొద్దని.. భక్తులు, గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పులిని బంధించి అడవికి తరలించాలనే ప్రయత్నంలో కాకినాడ జిల్లా డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావు నేతృత్వంలో అధికారులు పని చేస్తున్నారు. ఎన్‌ఎస్టీఆర్, వీహెచ్‌ఎఫ్ ట్రాకింగ్, పులికి మత్తు ఇచ్చే డార్టింగ్ సిబ్బంది, రక్షణ బృందాలు 100 మంది పహారా కాస్తున్నారు. అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథరెడ్డి ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**గురజాల జీడీసీసీ బ్యాంకులో**

## రూ.11.66 కోట్ల అవినీతి

ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేయడం, రికవరీలో తీవ్ర నిర్లక్ష్యం చూపడం, కొంత మంది రుణగ్రహీతలతో కుమ్మక్కై బ్యాంకు నిధులను పక్కదారి పట్టించడం వంటి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక విచారణకు ఆదేశించింది. విచారణలో సుమారు రూ.11.66 కోట్ల వరకు నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఈ నేపథ్యంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ క్రమంలోనే బ్యాంక్ చీఫ్ మేనేజర్ పున్నారావును సస్పెండ్ చేశారు.

**రాహుల్ గాంధీకి**

## అది కూడా తెలియదా?

ఆరోపించారు. సమాజంలోని అన్ని వర్గాలకూ అందుబాటు ధరల్లో వైద్య సేవలు లభించేలా భాజపా కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని వైద్య సదుపాయాలను గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల స్థాయికి తీర్చిదిద్దారని సీఎం హిమంత బిశ్వశర్మను అభినందించారు. ఇటీవల దిల్లీలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంపై అమిత్ షా మండిపడ్డారు. అదేవిధంగా పార్లమెంట్ మెట్లపై నిలబడి రాహుల్ గాంధీ చాయ్, పకోడీలు తీసుకోవడాన్ని కూడా ఖండించారు. పార్లమెంట్ అనేది ప్రజాస్వామ్యానికి పవిత్ర ప్రదేశమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో అమిత్ షా పర్యటించడం నాలుగు నెలల్లో ఇది నాల్గోసారి.

## విజయ్‌కి డిప్యూటీ సీఎం పోస్టు ఆఫర్..?

చేరుకున్నాయని భాజపా వర్గాలు తెలిపాయి. ఆ పార్టీకి 80 సీట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు పేర్కొన్నాయి. విజయ్‌కు డిప్యూటీ సీఎం పదవిని కూడా ఆఫర్ చేసినట్లు వెల్లడించాయి. ముఖ్యమంత్రి పదవిపై విజయ్ దృష్టి పెట్టారని.. చర్చల్లో ఈ విషయం కీలకంగా మారిందని చెప్పాయి. అయితే, ఈ విషయంపై ఇప్పటివరకు ఇరుపార్టీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భాజపా, డీఎంకేలతో తమకు పొత్తులు ఉండవని విజయ్ గతంలోనే తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయినా.. వీటికి సంబంధించిన వార్తలు వస్తూనే ఉండటం గమనార్హం.

**కేంద్రం పరిశీలనలో**

## విశాఖ మెట్రో ప్రాజెక్టు

చేస్తోందని, రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. హైదరాబాద్ ఓఆర్‌ఆర్‌లా విశాఖకు సెమీ రింగ్‌రోడ్డు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాంబిల్లి-భోగాపురం ప్రాజెక్టును వీఎంఆర్‌డీయే పరిశీలిస్తోందన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఒక రోడ్డుకు అటవీ భూమి అడ్డంకిగా ఉందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తాను మాట్లాడి సమస్యను పరిష్కరించామని నారాయణ తెలిపారు.

**డ్రగ్స్ కేసులో నన్ను లాగితే..**

## చట్టపరంగా నోటీసులిస్తా..

డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉండాలి. నేను ఏ పరీక్షకైనా సిద్ధమని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశా. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టు చేయించుకొని అందరికీ ఆదర్శంగా ఉందాం. డ్రగ్స్ కేసులోకి నన్ను లాగితే చట్టపరంగా నోటీసులిస్తా" అని అన్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ బృందం సమాధానం చెప్పాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలని ఆయన అన్నారు.

## గొప్ప నేత ఎన్టీఆర్

మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సమాజంలోని పేద, బలహీన వర్గాలకు విద్యా మరియు వైద్య సహాయం అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ట్రస్ట్ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

## పశ్చిమాసియా సంక్షోభం..

పెరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజా సంక్షోభానికి ముగింపు పలికేందుకు బ్రిక్స్ కూటమి దేశాలు కూడా తమ ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న భారత్.. సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

## 'ఖర్గ్'పై సరదాగా మరిన్ని దాడులు చేస్తాం : ట్రంప్

లక్ష్యంగా ఇప్పటికే అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో వాటిని పూర్తిగా ధ్వంసం చేసినట్లు ట్రంప్ పేర్కొన్నారు. అక్కడి చమురు క్షేత్రాలను మాత్రం టచ్ చేయలేదని వెల్లడించారు. ఇక యుద్ధం ముగింపునకు సంబంధించి ఒక ఒప్పందం కోసం చర్చలకు ఇరాన్ సిద్ధంగా ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, అందుకు ప్రతిపాదించిన షరతులు సరిపోవని అన్నారు. దీంతో యుద్ధం ముగించేందుకు ఇప్పుడు తాను సిద్ధంగా లేనని తేల్చిచెప్పేశారు. కాల్పుల విరమణకు సంబంధించిన నిబంధనలు బలంగా ఉండాలన్నారు. అయితే, అవేంటో చెప్పేందుకు ట్రంప్ నిరాకరించారు.

## మోగిన నగారా

ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు షెడ్యూల్ ప్రకటించారు.

**నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో..**

మొత్తం ఓటర్ల సంఖ్య - 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు 824
పోలింగ్ స్టేషన్లు - 2.19లక్షలు
ఎన్నికల అధికారులు - 25 లక్షలు

**ఎనిమిది స్థానాల్లో ఉప ఎన్నిక..**

వీటితోపాటు ఆరు రాష్ట్రాల్లో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నిక జరగనుంది. గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురాలో ఐదు స్థానాలకు ఏప్రిల్ 9న, గుజరాత్, మహారాష్ట్రల్లోని మూడు అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ ఎనిమిది స్థానాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. వీటి ఫలితాలు కూడా మే 4న వెల్లడి కానున్నాయి.

## ఏపీలో 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు షాక్..

**కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు**

ఈ నెలలో ఇప్పటికే సగం రోజులు గడిచిపోయాయి. ఇప్పటికే ఉద్యోగుల వివరాలను నమోదు చేయకపోవడంతో వచ్చే నెల జీతాలు డౌటే అంటున్నారు. ఏపీలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ నెల జీతం ఇప్పటికీ అందలేదు. వచ్చే నెల జీతం కూడా అందే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. దీంతో సుమారు 50 వేల కుటుంబాలు ఆర్థికంగా సతమతమవుతున్నారని అంటున్నారు. ఈ నెల, వచ్చే నెలలో వరుస పండుగలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, జీతం అందే పరిస్థితి లేకపోవడంతో చిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ఇలాంటి పరిస్థితి ఎదురైందని చెబుతున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'నిధి పోర్టల్' విధానంతో 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు నిలిచిపోయాయని అంటున్నారు. ప్రభుత్వ సిబ్బంది జీతాలను ఒకే విధానంలో చెల్లించేందుకు ఈ నూతన విధానం తీసుకువచ్చారు. 'నిధి పోర్టల్'లో ఉద్యోగుల వివరాలు, బిల్లులు సమర్పిస్తేనే జీతాలు విడుదల అవుతాయి. అయితే చాలా శాఖల అధికారులు కాంట్రాక్టు ఉద్యోగుల పూర్తి వివరాలు, క్యాడర్ స్ట్రెంగ్త్, పోస్టుల సమాచారాన్ని ఇప్పటివరకు నిధి పోర్టల్ లో నమోదు చేయలేదు. దీంతో జీతాల బిల్లులు ట్రెజరీలకు చేరకపోవడం వల్ల ఫిబ్రవరి జీతాలు నిలిచిపోయాయని చెబుతున్నారు. ఈ నెలలో ఇప్పటికే సగం రోజులు గడిచిపోయాయి. ఇప్పటికే ఉద్యోగుల వివరాలను నమోదు చేయకపోవడంతో వచ్చే నెల జీతాలు డౌటే అంటున్నారు. ప్రతినెలా 20 నుంచి 25 మధ్య జీతాల బిల్లులు ఆన్ లైన్ లో ఉంచితే, ఒకటో తేదీకి జీతాలు విడుదల చేస్తారు. అయితే ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన విధానం వల్ల ఉద్యోగుల



వివరాలను అప్ లోడ్ చేయడమే పూర్తికాలేదు. ఇక బిల్లులు సబ్ మిట్ చేసే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదని అంటున్నారు. దీంతో మార్చినెల జీతం అందే పరిస్థితి ఉండదని, మే నెలలోనే జీతాలు చెల్లించే పరిస్థితి ఉందని అంటున్నారు. దీంతో చిరుద్యోగుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి జీతాలు నిలిచిపోవడం, వచ్చేనెల జీతం అందే పరిస్థితి లేకపోవడం ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నెలలో ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి వంటి పండుగలు ఉన్నాయి. దీంతో సాధారణ ఖర్చులకు తోడుగా పండుగ ఖర్చులు అధికంగా చేయాల్సివుంటుంది. అంతేకాకుండా ఇంటి అద్దెలు, ఈఎంఐ చెల్లింపులు ఉద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు చేతిలో చిల్లిగవ్వలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. నిధి పోర్టల్ ను తాత్కాలికంగా పక్కన పెట్టి, పాత విధానంలో అయినా తమ జీతాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

## చెవిరెడ్డిని దూరంపెట్టిన జగన్..? ఈ ప్రచారం నిజమేనా?!

అంతేకాకుండా గత ఎన్నికల్లో చెవిరెడ్డి పోటీ చేసిన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యామ్నాయం చూస్తున్నారని, చెవిరెడ్డిని ఆయన సొంత నియోజకవర్గం చంద్రగిరికి మాత్రమే పరిమితం కావాలని అధినేత ఆదేశించారని అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి, వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మధ్య దూరం పెరిగిందా? సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారం ఈ అనుమానానికి కారణమవుతోంది. ఏపీ మద్యం స్కాంలో అరెస్టు తర్వాత జైలుకు వెళ్లిన చెవిరెడ్డి బెయిలుపై బయటకు వచ్చాక పార్టీ అధినేత జగన్ ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ, చెవిరెడ్డికి అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. జగన్మోహనరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, ఆయన అంతరంగిక బృందంలోని కీలక నేతగా చలామణీ అయిన చెవిరెడ్డిని దూరం పెట్టాల్సిన అవసరం ఏంటి? ఈ ప్రచారంలో నిజమెంత? అన్న విషయాలపై పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ డిబేట్ జరుగుతోంది. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజవర్గానికి చెందిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అత్యంత సన్నిహితుడు. వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలతోపాటు పార్టీ తరపున చేసే సర్వేలు అన్నీ చెవిరెడ్డి పర్యవేక్షించేవారు. అయితే ఇటీవల ఈ బాధ్యతలు నుంచి చెవిరెడ్డిని తప్పించినట్లు వైసీపీలో అంతర్గతంగా చర్చ నడుస్తోంది. వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలను పార్టీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి కొడుకు భార్గవరెడ్డికి అప్పగించాలని, ఆ విషయాలను చెవిరెడ్డి పట్టించుకోవద్దని జగన్ చెప్పారని అంటున్నారు. ఈ విషయాన్ని కూడా జగన్ నేరుగా చెప్పలేదని, పార్టీ నేతల ద్వారా ఆయా బాధ్యతల నుంచి చెవిరెడ్డి దూరంగా ఉండాలని సూచించినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా గత ఎన్నికల్లో చెవిరెడ్డి పోటీ చేసిన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యామ్నాయం చూస్తున్నారని, చెవిరెడ్డిని ఆయన సొంత నియోజకవర్గం చంద్రగిరికి మాత్రమే పరిమితం కావాలని అధినేత ఆదేశించారని అంటున్నారు. అయితే ఈ మార్పులపై జగన్ తో మాట్లాడేందుకు చెవిరెడ్డి ప్రయత్నిస్తున్నా, అధినేత అవకాశం ఇవ్వడం లేదని అంటున్నారు. దీనికి కారణం చెవిరెడ్డికి అధికార టీడీపీలోని కొందరు ఎమ్మెల్యేలతో ఉన్న సంబంధాలే అంటున్నారు.



ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం మార్కాపురం జిల్లా పరిధిలోకి వెళ్లిన ఓ నియోజకవర్గ ఎమ్మెల్యేతో చెవిరెడ్డి చాలా చనువుగా ఉంటున్నారని జగన్ రెడ్డికి ఫిర్యాదులు వెళ్లాయని అంటున్నారు. ఈ కారణంగానే ఒంగోలు పార్లమెంటు బాధ్యతలతోపాటు పార్టీలోని కీలక వ్యవహారాల నుంచి చెవిరెడ్డిని తప్పించినట్లు చెబుతున్నారు. తనకు అత్యంత సన్నిహితంగా మెలుగుతున్న నేతలు ఏ దశలోనూ, ఏ రూపంలోనూ ప్రత్యర్థులతో సంబంధాలు ఏర్పరుచుకోకూడదన్న ఆలోచనలో అధినేత జగన్ ఉన్నారని అంటున్నారు. ఈ కోణంలోనే చెవిరెడ్డిని దూరం పెట్టి, మిగిలిన వారికి గట్టి సందేశం ఇవ్వాలని ఆయన భావించినట్లు చెబుతున్నారు. చెవిరెడ్డి తన సొంత నియోజకవర్గంలో రాజీ లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేతో పోరాడుతున్నారని, కానీ మిగిలిన చోట్ల ఆయన టీడీపీ నేతలతో రాజీ ధోరణి ప్రదర్శిస్తున్నారని జగన్ కు ఫిర్యాదులు వెళ్లాయంటున్నారు. ఈ విధానం వల్ల భవిష్యత్తులో పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందని, ఆ ఆలోచనతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అందుకే ఎప్పుడూ జగన్ వెంట కనిపించే చెవిరెడ్డి ప్రస్తుతం తారసపడటం లేదని టాక్ నడుస్తోంది.

# ఎడిటర్ వాయిస్

## ఈసీ మీద అభిశంసన.. వైసీపీకి గోల్డెన్ ఛాన్స్

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజా అభిమానంతో గెలవలేదని ఈవీఎంల సహకారంతో గెలిచిందని తరచూ వైసీపీ నేతలు విమర్శిస్తూ ఉంటారు. నిన్నటికి నిన్న ఆ పార్టీ కీలక నేత లక్ష్మీ పార్వతి కూడా మీడియా మీట్ లో ఇదే విషయం చెబుతూ చంద్రబాబుని విమర్శించారు. ఇక గత ఇరవై నెలల కాలంలో అయితే వైసీపీ తమ ఓటమి వెనక ఈవీఎంల ట్యాంపరింగ్ ఉందని పదే పదే ఆరోపిస్తూ వచ్చింది. ఈ విషయంలో జాతీయ స్థాయిలోనూ కదిపి టాపిక్ గా చేసింది. అంతే కాదు రాష్ట్రపతికి సైతం ఫిర్యాదు చేసింది. మరి అలాంటి వైసీపీకి ఇపుడు ఒక గోల్డెన్ ఛాన్స్ వచ్చింది అని అంటున్నారు.

**విపక్షం ఒక్కటిగా :** అదేంటి అంటే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ మీద ప్రతిపక్షాలు ఉమ్మడిగా అభిశంసన తీర్మానం ఇచ్చాయి. ఆయనను అభిశంసించి వెనక్కి పంపాలన్నది విపక్షాల ఆలోచన. స్పీకర్ మీద అవిశ్వాసం తెచ్చిన విపక్షాలు ఇపుడు ఈసీ మీదనే విపక్షం అభిశంసనకు రెడీ అయింది. లోక్ సభ రాజ్యసభ ఎంపీలు అంతా కలసి 193 మంది దాకా ఈ అభిశంసన తీర్మానం మీద నోటీసు ఇవ్వాలని చూస్తున్నాయి. ఇందులో లోక్ సభ నుంచి 130 మంది, రాజ్యసభ నుంచి 63 మంది ఎంపీలు ఈ అభిశంసన తీర్మానం మీద సంతకాలు చేశాయి.

**వైసీపీ మీదనే చూపు :** దాంతో అందరి చూపు ఇపుడు వైసీపీ మీదనే ఉంది.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సర్ పేరుతో ప్రతిపక్ష రాష్ట్రాలలో ఓట్లను లేకుండా ఈసీ చేస్తోంది అన్నది విపక్షాల ఘాటు ఆరోపణ. అదే విధంగా ఈసీ విపక్షాలను ఇబ్బంది పెడుతోందని కూడా మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈసీ మీద అభిశంసనకు సిద్ధపడుతున్నారు. మరి ఈ విషయంలో ఏపీలో విపక్ష పాత్రంలో ఉన్న వైసీపీ ఏమి చేయబోతోంది అన్నదే చర్చగా ఉంది. వైసీపీ విషయం తీసుకుంటే ఈవీఎంల ట్యాంపరింగ్ చేశారు అని అంటోంది. అలాగే ఈ మధ్యనే ఏకంగా 51 లక్షల ఓట్లు అదనంగా చేరాయని సాయంత్రం తరువాత అర్ధరాత్రి నుంచి జరిగిన పోలింగ్ లో అధిక శాతం ఓట్లు ఎలా పడ్డాయన్నది కూడా చర్చ ఉంది. వైసీపీ నుంచి కొంతమంది దీని మీద గళం విప్పారు. ఆ విధంగా చూస్తే ఈసీ మీద వైసీపీకి గుర్రు ఉంది. మరి ఇదే సరైన సమయంగా వైసీపీ కూడా ఈసీ మీద అభిశంసన తీర్మానానికి సంతకం చేస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

**న్యూట్రల్ అంటూనే :** ఇక వైసీపీ తీరు జాతీయ స్థాయిలో చూస్తే న్యూట్రల్ అంటూనే కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమికి పూర్తి దూరంగా ఉంటోంది. అదే సమయంలో అవసరమైన సందర్భాలలో అధికార ఎన్డీయే బిల్లులకు మద్దతు ఇస్తోంది. మరి అలాంటి సందర్భోచిత సమయాల్లో ఇండియా కూటమి వైపు కూడా మొగ్గు చూపవచ్చు కదా అంటే వైసీపీకి కాంగ్రెస్ తో ఉన్న వైరాన్ని గుర్తుకు తెచ్చుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇపుడు కాంగ్రెస్ సహా విపక్షాలు ఇచ్చిన అభిశంసన తీర్మానం మీద వైసీపీ సంతకం చేసి వారితో కలసి ఎన్డీయే సర్కార్ కి వ్యతిరేకంగా గళం విప్పుతుందా అన్నది పెద్ద చర్చగా ఉంది.

**నిబద్ధత చాటుకోవాలంటే :** ఇక ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారానే ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది అన్న వైసీపీ వాదనలోని నిబద్ధత చాటుకోవాలీ అంటే కచ్చితంగా ఈసీ మీద అభిశంసన తీర్మానానికి వైసీపీ మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. అలా కాదని దూరం జరిగితే మాత్రం భవిష్యత్తులో ఇంకెప్పుడు ఈవీఎంల ట్యాంపరింగ్ గురించి మాట్లాడే నైతిక అవకాశాన్ని కోల్పోతుందని అంటున్నారు. అయితే ఇక్కడో చిక్కు ఉంది ఎన్డీయేకు వ్యతిరేకంగా వైసీపీ వెళ్తే భవిష్యత్తులో వచ్చే రాజకీయ ఇబ్బందులు కూడా చర్చకు ఆస్కారం ఇస్తున్నాయని అంటున్నారు. మొత్తానికి చూస్తే జాతీయ స్థాయిలో వైసీపీ స్టాండ్ అన్నది ఎపుడూ కొంత గందరగోళంగా ఉంటోంది అన్న విమర్శలు ఉంటున్నాయి. అదే సమయంలో ఏపీలో ఈవీఎంల ట్యాంపరింగ్ తో సహా ఎన్నికల్లో అక్రమాలు ఏవో జరిగాయని సగటు వైసీపీ కార్యకర్త ఈ రోజుకీ బలంగా నమ్ముతున్న వేళ అధినాయకత్వం వచ్చిన ఈ అవకాశాన్ని వాడుకుని క్యాడర్ లో మనో ధైర్యాన్ని నింపుతుందా లేదా అన్నదే అంతా చూస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్



## మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో కలకలం



### డ్రగ్స్ పార్టీ సమాచారంతో ఈగల్ తనిఖీలు

### కాల్పులు జరిపిన కారు డ్రైవర్ - పార్టీలో పాల్గొన్న ఒకరికి పాజిటివ్!

**మొయినాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి ఈగల్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్టు సమాచారం రావటంతో రాత్రి 11 గంటల సమయంలో పెద్ద ఎత్తున సోదాలు చేపట్టింది. అక్కడ ఒక మహిళ సహా 11 మంది ప్రముఖులున్నట్టు పోలీసులు గుర్తించారు. వీరిలో రోహిత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ప్రజాప్రతినిధి, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారని సమాచారం. పోలీసులు లోపలికి వెళ్లే సమయంలో కొందరు యువకులు వారితో వాగ్వాదానికి దిగినట్టు తెలిసింది. అదే సమయంలో ఓ కారు డ్రైవర్.. చేతిలోని లైసెన్స్‌డ్ పిస్టల్ నుంచి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. పిస్టల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ఇంకా ఒక బుల్లెట్ ఉందని గుర్తించారు. కాల్పులు జరిపిన డ్రైవర్ ఎవరు.. ఆ పిస్టల్ ఎవరిదీ అన్నది తెలియాల్సి ఉంది. పార్టీలో పాల్గొన్న వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఒక నాయకుడికి పాజిటివ్, మిగిలిన వారికి నెగెటివ్ వచ్చినట్లు తెలిసింది.

## పోస్టల్ డాక్ సేవ గిఫ్ట్స్ పేరిట సందేశం వచ్చిందా? జాగ్రత్త




**విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఇండియా పోస్ట్ - డాక్ సేవ గిఫ్ట్స్' అంటూ తపాలా శాఖ పేరిట సామాజిక మాధ్యమాల్లో ఓ సందేశం చక్కర్లు కొడుతోంది. సందేశంలో పేర్కొన్న లింక్‌ను క్లిక్ చేస్తే.. ప్రత్యేక బహుమతులు, రివార్డులు పొందొచ్చనేది దాని సారాంశం. ఇలాంటి సందేశం మీకు వచ్చిందా? అయితే జాగ్రత్త! ఇది సైబర్ పన్నాగం అని గ్రహించండి. ఇటువంటి నకిలీ ప్రకటనలతో భారత తపాలా శాఖకు ఎటువంటి సంబంధం లేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బహుమతుల పేరిట వచ్చే అనుమానిత లింకులను, వెబ్‌పేజీలను క్లిక్ చేయకూడదని తెలిపింది. ఆధార్ వివరాలు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు వంటి వ్యక్తిగత వివరాలను తస్కరించేందుకు సైబర్ నేరగాళ్లు ఇలాంటి ఎత్తుగడలు వేస్తుంటారని పేర్కొంది. అనధికార ప్రకటనలను విశ్వసించొద్దని, ఏదైనా సందేహం ఉంటే అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

## పోలీసులకు భయపడి.. లారీని ఢీ కొట్టి.. యువకుడి దుర్మరణం



**గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా గన్నవరం మండలం బొటుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ట్యూషన్‌కు వెళ్లిన అన్నదమ్ములు తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. యువకులు భయపడి బైక్‌ను వెనక్కి తిప్పే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దర్నీ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రణయ్ మరణించాడు. అతడిని కీసరపల్లివాసిగా పోలీసులు గుర్తించారు. అయితే, ద్విచక్రవాహనాన్ని ఆపే క్రమంలో.. కానిస్టేబుల్ వెంటపడి బైక్ హ్యాండిల్ పట్టుకొని లాగారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు.

## కత్తితో దాడి చేసిన తల్లి..

### కుమార్తె మృతి, కుమారుడికి గాయాలు

**భువనగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ తగాదాల నేపథ్యంలో కుమార్తె, కుమారుడిపై తల్లి కత్తితో దాడి చేసింది. ఆపై తానూ ఆత్మహత్యకు యత్నించింది. భువనగిరి మండలం తుక్కపురంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం జైనపల్లికి చెందిన బెజ్జంకి నరేందర్‌రెడ్డి, నీలిమ భార్యాభర్తలు. వీరికి కుమార్తె క్రితి రెడ్డి (13), కుమారుడు అంశాత్‌రెడ్డి ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య గత కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నీలిమ.. తన పిల్లలతో కలిసి తుక్కపురంలోని తల్లి ఇంటికి వచ్చింది. ఆదివారం తెల్లవారుజామున క్రితిరెడ్డి, అంశాత్‌రెడ్డిపై కత్తితో దాడి చేసింది. గొంతుకోయడంతో కుమార్తె క్రితిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా.. అంశాత్‌రెడ్డి గాయాలతో తప్పించుకున్నాడు. కుమారుడు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత నీలిమ ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నీలిమ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఘనంగా పెళ్లి చేసుకుని..

## అడ్డంగా దొరికిపోయాడు..

### బంగారు నగల దుకాణంలో గుమస్తా చేతివాటం
### వివాహానికి వచ్చిన యజమానులకు అనుమానం రావడంతో అసలు విషయం వెలుగులోకి..



**పెదన, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారం దుకాణంలో గుమస్తాగా పని చేసే ఓ యువకుడు ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. వివాహానికి భారీ ఏర్పాట్లు చేశాడు. తన స్థాయికి మించి ఖర్చు పెట్టాడు. ఆ పెళ్లికి నగల షాపు యజమానులు కూడా వచ్చారు. గుమస్తాగా పని చేసే యువకుడు.. వివాహానికి ఇంత ఘనంగా ఎలా ఏర్పాట్లు చేశాడనే అనుమానం వారికి వచ్చింది. వెంటనే అప్రమత్తమై సరిచూసుకోగా.. ఆభరణాల లెక్కల్లో భారీ తేడా కనిపించింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన కృష్ణా జిల్లా పెదనలో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రముఖ నగల దుకాణంలో పని చేస్తున్న సదరు యువకుడు దాదాపు రూ.1.50 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు మాయం చేసినట్లు తెలిసింది. పెదనకే చెందిన అతను ఆ దుకాణంలో ప్రధాన గుమస్తాగా బాధ్యతలు నిర్వర్తించేవాడు. యజమానులు మరో చోట ఉంటారు. దానిని అవకాశంగా తీసుకొని కొంతకాలంగా ఆభరణాలను పక్కదారి పట్టించాడు. దాదాపు నెల కిందట యువకుడి వివాహం జరిగింది. కొన్ని రోజుల తర్వాత యువకుడిని ప్రశ్నించగా... విషయం బయటపడింది. యజమానులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా...కేసు నమోదు చేయకుండా పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. యువకుడి ఇంటి నుంచి యజమానులు.. వెండి బిందెలు, రూ.లక్షల్లో నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## 14 నెలల చిన్నారిని చంపిన తల్లి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని గోల్కొండ రిసాల్ బజార్‌లో దారుణం చోటు చేసుకుంది. భర్తతో గొడవపడిన మహిళ 14 నెలల కుమార్తెను చంపేసింది (జతీఱవ చీవఞ). రంజాన్ దృష్ట్యా కొత్త దుస్తుల విషయంలో దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈక్రమంలో ఆవేశానికి గురైన గౌసియాబేగం 14 నెలల కుమార్తెను దిండుతో ఊపిరాడకుండా చేసి చంపింది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొయినాబాద్ డ్రగ్స్ కేసు..

## ఆరుగురికి పాజిటివ్ : ఈగల్ ఎస్పీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు ఈగల్ బృందం ఎస్పీ గిరిధర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు పాజిటివ్ వచ్చినట్లు చెప్పారు. శనివారం రాత్రి నిర్వహించిన ర్యాపిడ్ టెస్ట్‌లో ఎంపీ పుట్టా మహేశ్‌కు నెగెటివ్ వచ్చిందని.. రక్త పరీక్షలో పాజిటివ్ వచ్చిందని ఎస్పీ తెలిపారు. నెగెటివ్ వచ్చిన వారిలో రమేశ్, శ్రవణ్‌కుమార్, విజయ్‌కృష్ణ, సిలివేరి శరత్‌కుమార్, ప్రియాంకరెడ్డి ఉన్నట్లు చెప్పారు. మొయినాబాద్ అజీజ్‌నగర్‌లోని తన ఫామ్‌హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి వీకెండ్ పార్టీ ఏర్పాటు చేశారని ఎస్పీ తెలిపారు. శనివారం రాత్రి ఈగల్ బృందం రైడ్ చేస్తున్న సమయంలో కాల్పుల శబ్దం వినిపించిందన్నారు. అప్పుడు నమిత్ అనే వ్యక్తి చేతిలో తుపాకీ ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. నమిత్‌ను ఢిల్లీకి చెందిన వ్యక్తిగా ప్రాథమికంగా నిర్ధరించామని తెలిపారు.

# కిడ్స్ వాయిస్




## శాటిలైట్లు కింద పడవా?




శాటిలైట్.. ఆకాశం నుంచి భూమికి సంబంధించిన ఫొటోలు తీస్తూ, ఇతర సమాచారమూ సేకరించి పంపిస్తుంటుంది. ఉపగ్రహాలుగానూ పిలిచే ఇలాంటివి భూమి చుట్టూ బోలెడు తిరుగుతున్నాయి. 'అలా ఆకాశంలో తిరిగే శాటిలైట్లు కింద పడిపోవా?' అనే సందేహం ఎప్పుడైనా వచ్చిందా? ఆకాశంలో ఏ ఆధారం లేకుండా శాటిలైట్లు ఎలా తిరుగుతాయో తెలుసుకుందాం. గురుత్వాకర్షణ శక్తి గురించి తెలుసు కదా.. ఏ వస్తువునైనా తనవైపు లాక్కొనేలా భూమికి ఉండే శక్తి అది. ఏ వస్తువునైనా గాల్లో వదిలేస్తే కింద పడటానికి కారణమదే. మరి, ఆకాశంలో వదిలేసే శాటిలైట్ సంగతేంటి? గురుత్వాకర్షణ కారణంగా అది భూమిపై పడిపోవాలి కదా! నిజమే, గురుత్వాకర్షణ శక్తి శాటిలైట్‌ను కూడా భూమివైపు లాగుతూనే ఉంటుంది. అయితే.. గురుత్వాకర్షణ శక్తిని, తన ప్రయాణ వేగాన్ని సమతుల్యం చేసుకుంటూ, ఆ శక్తిని అధిగమించేందుకు అవసరమైన స్పీడ్‌తో శాటిలైట్ తన కక్ష్యలో తిరుగుతుంటుంది. మరి, శాటిలైట్లు ఒకదాన్ని మరొకటి ఎందుకు ఢీకొట్టవనే సందేహం వస్తుంది కదా! నిజానికి అలా జరిగే అవకాశం ఉంది. కానీ, శాటిలైట్‌ను ప్రయోగించినప్పుడు ఒక దానికొకటి ఢీకొన కుండా నివారించేం దుకు ఒక స్థిరమైన కక్ష్యలో ఉంచుతారు. అందుకని ఢీకొట్టడం వంటి ఘటనలు చాలా అరుదే. ఉపగ్రహాలు తమ కక్ష్యలో చాలాకాలమే ఉంటాయి. 50 ఏళ్లకు పైగా పని చేసినవి కూడా ఉన్నాయి. చివరికి కాలంతీరిన శాటిలైట్‌ను జాగ్రత్తగా శ్మశానవాటికగా వ్యవహరించే కక్ష్యలోకి పంపుతారు. ఆ కక్ష్యలో తక్కువ గురుత్వాకర్షణ శక్తి ఉండటం వల్ల చాలా తక్కువ వేగమైనా సరిపోతుంది. భూమికి దగ్గరగా ఉండే ఉపగ్రహాలు బలమైన గురుత్వాకర్షణ శక్తిని అధిగమించేందుకు ఎక్కువ వేగంతో తిరుగుతుండాలి. చాలాదూరంలో ఉండే ఉపగ్రహాలపై గురుత్వాకర్షణ శక్తి ప్రభావం తక్కువగా ఉండటం వల్ల నెమ్మదిగా కదిలినా సరిపోతుందన్నమాట!

## గాలిలో ఏముంటుంది?



ఫ్రెండ్స్... మీరు ఎప్పుడైనా గాలిని చూశారా? ఎవరైనా చూస్తారా దాన్ని? అనే కదా మీరనుకుంటుంది. మరి, మన చుట్టూ ప్రతిచోటా గాలి ఉంటుంది కదా! ప్రతి ఖాళీలోనూ ఉంటుంది. మనం శ్వాస తీసుకున్న ప్రతిసారీ ఊపిరితిత్తులు గాలితోనే నిండిపోతాయి. అంటే మన చుట్టూ, మన లోపల గాలి ఉన్నా కనిపించడం లేదన్నమాట. గాలిని కంటితో చూడకున్నా, రుచి చూడకున్నా, అది ఉన్నట్లయితే తెలుస్తుంటుంది కదూ! మరి, గాలిలో ఏముంటుందో తెలుసుకుందామా! గాలి ఒక పదార్థం. శాస్త్రవేత్తలు కూడా పదార్థమనే అర్థంలో మ్యాటర్ అని వ్యవహరిస్తారు. పదార్థం అంటే ఘనరూపం కావచ్చు, ద్రవరూపంలోనూ ఉండొచ్చు. ఇక్కడ పదార్థంగా పిలిచే గాలి వాయు రూపంలో ఉంటుంది. ఇంతకీ గాలి ఎలా ఏర్పడుతుందంటే.. కొన్ని రకాల వాయువులతో కలిసి ఏర్పడుతుంది. అందులో నైట్రోజన్, ఆక్సిజన్ ముఖ్యమైనవి. గాలిలో 99శాతం ఇవే ఉంటాయి. 78శాతం నైట్రోజన్, 21శాతం ఆక్సిజన్ నిష్పత్తిలో ఉంటాయి. మిగతా ఒక శాతం అరుదైన వాయువులుగా పిలిచే అర్గాన్, నియాన్, హీలియం, క్రిప్టన్, జెనాన్ వంటి వాటితో నిండుతుంది. స్వల్ప పరిమాణంలో కార్బన్‌డయాక్సైడ్ కూడా ఉంటుంది. దీన్ని ప్రాణమున్న జీవులు చేరుస్తాయన్నమాట. గాలితో కూడిన మహాతలం భూమి ఉపరితలం పైనుంచి కొన్ని మైళ్ల పైదాకా విస్తరించి ఉంటుంది. ఎందుకంటే, గాలిని గురుత్వాకర్షణ శక్తి లాగుతుంటుంది. లేదా భూమి వైపుగా పట్టి ఉంచుతుంది. గాలికీ బరువు ఉంటుంది. అది పీడనాన్ని కలుగజేస్తుంది. మన శరీరం మొత్తాన్ని గాలి అన్నివైపుల నుంచీ పీడనానికి గురిచేస్తుంది. ఏదైనా పర్వతం పైకి ఎక్కినప్పుడు, విమానంలో వెళ్లినప్పుడు, అలా పైకి వెళ్లినకొద్దీ తక్కువ గాలి ఉంటుంది. అందుకనే, పీడనమూ తగ్గుతుంది. దాదాపు వంద కిలోమీటర్ల పైన పీడనమే ఉండదు తెలుసా!

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 16 మార్చి 2026


www.viswamvoice.com

## కోలాహలంగా ఎమ్మెల్యే గోరంట్ల పుట్టినరోజు వేడుకలు

### పిన్నమరెడ్డి ఈశ్వరుడు ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ మండలం కొంతమూరులో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి 81వ జన్మదిన వేడుకలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. టిడిపి గ్రామ అధ్యక్షుడు పిన్నమరెడ్డి ఈశ్వరుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు వేలాదిగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గోరంట్లకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరి నియోజకవర్గం ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొని అభిమానుల సమక్షంలో గోరంట్ల 81 కేజీల కేక్ ను కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో బుచ్చయ్య అజాతశత్రువు అని తెలియజేస్తూ.. ఆయనకున్న సుదీర్ఘ రాజకీయ అనుభవంతో నాలుగు దశాబ్దాల పాటు అనేక ఆటుపోటులు ఎదుర్కొంటూ తిరుగులేని నేతగా రాణిస్తున్నారని కొనియాడారు.ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ



నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్రలో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నీతి, నిబద్ధతతో సేవలందించానని తెలిపారు. పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని..వారు లేనిదే తాను లేనని పేర్కొంటూ.. తనకు ఊపిరి ఉన్నంతవరకు పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా రాజమండ్రి నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దానని.. భవిష్యత్తులో రూరల్ నియోజకవర్గాన్ని రోల్ మోడల్ గా తయారు చేస్తానని చెప్పారు. తన పుట్టినరోజు పురస్కరించుకుని నగర, రూరల్ నియోజకవర్గాల నుండి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులకు అభిమానులకు గోరంట్ల ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పిన్నమరెడ్డి ఈశ్వరుడు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఆయన చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా గోరంట్ల పాటుపడుతున్నారని.. ఆయన ఆశయాలు కనుగొనంగా పనిచేస్తామని తెలిపారు. గోరంట్ల ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 2000 మందికి పైగా పేద మహిళలకు చీరలుపంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని గోరంట్ల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు అడ్డాల శ్రీను, టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, జ్ఞానం, ప్రశాంతత కొరకు

## సర్వమత ప్రార్థనలు : బొడ్డేటి సురేష్







**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో తమ విద్యార్థులు పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని గోకవరంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించినట్టు జ్ఞాన సరస్వతి విద్యానికేతన్ డైరెక్టర్ బొడ్డేటి సురేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఏడాది మొత్తం ఎంతో కష్టపడి చదివి పరీక్షలకు సన్నద్ధమవుతున్న వేళ వారిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, నింపమని శనివారం గోకవరం నుండి గుమ్మళ్ళదొడ్డి గ్రామం వరకూ తమ సిబ్బందితో కాలినడకన వెళ్లి వెంకటేశ్వర స్వామి ని ప్రార్థించామని అదే విధంగా ఆదివారం స్థానిక మసీద్, చర్చ్ లలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రార్థనలు చేసినట్టు ఆయన తెలిపారు.

## గండి పోశమ్మ జాతర బ్రోచర్ విడుదల చేసిన ఎమ్మెల్యే శిరీష

### ఈ నెల 20 నుండి 24 వ తేదీ వరకూ వరకు మాతృశ్రీ గండి పోశమ్మ జాతర మహోత్సవాలు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాతృశ్రీ గండి పోశమ్మ దేవస్థానం అత్యంత పురాతన ప్రాచుర్యం పొందిన దేవాలయమని రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం గండి పోశమ్మ దేవస్థానం చైర్మన్ మలుగుల శ్రీనివాస రెడ్డి సౌజన్యంలో జాతర మహోత్సవాలు బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గండి పోశమ్మ దేవస్థానం దేశంలోనే చాలా ప్రసిద్ధి గాంచిన దేవాలయమన్నారు. పోలవరం ప్రాజెక్టు లో దేవాలయం మునిగిపోయే అవకాశం ఉన్నప్పటికీ ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి నష్టం లేకుండా ఒక ఆదర్శ దేవాలయంగా నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు. జాతర మహోత్సవాలను ఈ నెల 20 నుండి 24 వ తేదీ వరకూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో సంప్రదాయ బద్దంగా నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయా జాతర మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆమె వెంట గండి పోశమ్మ దేవస్థానం చైర్మన్ మలుగుల శ్రీనివాసరెడ్డి ,గండి లక్ష్మి కుమార్ ఆలయ ఈవో మాజీ మండల పార్టీ అధ్యక్షులు మరి శెట్ల వెంకటేశ్వరా వు, కోండ్ల శివ రెడ్డి, పాముగండి సర్పంచ్ లంక పోసిబాబు, శివ శంకర్, కొండబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నేడు రంపచోడవరంలో యాదవిధిగా గ్రీవెన్స్



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్చి 16వ తేది సోమవారం ఉదయం 10.30 గంటల నుండి పిజిఆర్ఎస్(గ్రీవెన్స్) యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈనెల 16వ తారీకు సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశపు హాలులో ఉదయం 10.30 గంటల నుండి పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా వివిధ రకాలైన సమస్యల దరఖాస్తులు పీజీ ఆర్ఎస్ (గ్రీవెన్స్)లో సమర్పించుకోవచ్చని దరఖాస్తుదారులకు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## దామనపల్లి ఆశ్రమ పాఠశాలలో పది పరీక్షలకు సర్వం సిద్ధం

### పరీక్షలు రాయనున్న 188 మంది విద్యార్థులు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చెయ్యడం జరిగింది అని మండల విద్యాశాకాధికారి త్రిమూర్తులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవీపట్నం మండలం దామనపల్లి (ముసుళ్ళగుంట) ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐదు పాఠశాలలకు సంబంధించిన 188 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. వీరిలో బాలురు 57,బాలికలు 131 మంది ఉన్నట్టు ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 9.30 నుండి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన విద్యార్థులను సూచించారు. ఇప్పటికే పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు త్రాగు నీరు,వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ సహాయంవంటి ఏర్పాట్లు చెయ్యడం జరిగింది అని మండల విద్యాశాకాధికారి త్రిమూర్తులు తెలిపారు.

## జిల్లాలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరం

### అవసరానికి మించి బుకింగ్లు చేయొద్దు : కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో గృహ అవసరాల వినియోగం కోసం, అలాగే విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు మరియు అత్యవసర సేవలకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు గ్యాస్ సిలిండర్లు గోకవరం, విశాఖపట్నం, విజయవాడ లోని ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ల నుంచి ప్రతి రోజూ సాధారణ స్థాయిలో సరఫరా అవుతున్నాయని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో రోజుకు సుమారు 11,000 నుంచి 11,500 వరకు రీఫిల్ బుకింగ్లు నమోదవుతూ ఉంటాయని, అయితే ప్రస్తుతం రోజువారీగా 19,896 నుంచి 22,250 వరకు బుకింగ్లు నమోదవుతున్నాయని తెలిపారు. అంటే సాధారణ పరిస్థితులతో పోలిస్తే దాదాపు 90 నుంచి 95 శాతం వరకు పెరుగుదల నమోదైందన్నారు. సిలిండర్ల డెలివరీలు FIFO విధానంలో కొనసాగుతున్నందున కొన్నిచోట్ల బుకింగ్ చేసిన తరువాత 2 నుంచి 3 రోజులలో డెలివరీలు జరుగుతున్నాయని, కొన్నిచోట్ల అంతరాయం కారణంగా 2 నుంచి 3 రోజుల వరకు ఆలస్యం కనిపిస్తున్నదని వివరించారు. అందువల్ల గ్యాస్ సరఫరా విషయంలో వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి అవసరానికి మించి బుకింగ్లు చేయకుండా, అవసరం మేరకే సిలిండర్లు బుక్ చేసుకోవాలని వినియోగదారులను కోరారు. గ్యాస్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్లో హెల్ప్లైన్ నెంబర్ 8074661259 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే వినియోగదారులు ఈ సేవను వినియోగించుకోవచ్చని సూచించారు. ఒకేసారి అధిక సంఖ్యలో రీఫిల్ బుకింగ్లు చేయడం వల్ల కొన్నిసార్లు కాల్స్ కనెక్ట్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల వినియోగదారులు ఆయిల్ కంపెనీలు ఇచ్చిన నంబర్లకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపడం, మిస్డ్ కాల్ ఇవ్వడం, అలాగే PhonePe, Google Pay, Paytm, Amazon Pay వంటి UPI యాప్ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. ఏజెన్సీ వారీగా శనివారం నమోదైన బుకింగ్స్, డెలివరీలు మరియు గత 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న వివరాలను పరిశీలిస్తే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం 3,355 బుకింగ్స్ నమోదు కాగా 2,100 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 7,232 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న బుకింగ్స్ 1,544 ఉన్నాయి. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ పరిధిలో శనివారం 15,278 బుకింగ్స్ నమోదు కాగా 10,134 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 8,077 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న బుకింగ్స్ 18,306 ఉన్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ పరిధిలో శనివారం 1,236 బుకింగ్స్ నమోదు కాగా 727 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 1,138 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న బుకింగ్స్ 2,394 ఉన్నాయి. శనివారం రోజున మూడు ఆయిల్ కంపెనీల ద్వారా మొత్తం 19,869 బుకింగ్స్ నమోదు కాగా 12,961 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం మూడు సంస్థల వద్ద కలిపి 16,447 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 72 గంటలకు మించిన పెండింగ్ బుకింగ్స్ మొత్తం 22,244 ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ బుకింగ్స్ త్వరితగతిన క్లియర్ చేయడానికి ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ అదనపు సరఫరా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రాయవరంలో ప్రశాంతంగా

## "అక్షరాంధ్ర" ముగింపు పరీక్షలు

### మండలంలోని 31 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాసిన 1,840 మంది అభ్యాసులు





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన అక్షరాంధ్ర కార్యక్రమం ముగింపుగా నిర్వహిస్తున్న అక్షరాంధ్ర పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లోని,19 సచివాలయాలకు చెందిన 31 పరీక్షా కేంద్రాలలో 1840 మందికీ ఎంఈవో సూర్యనారాయణ పర్యవేక్షణలో ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వై.సూర్యనారాయణ మాట్లాడుతూ అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన అక్షరాంధ్ర కార్యక్రమానికి ప్రజలు మంచి స్పందన ఇస్తున్నారని తెలిపారు. మండలంలోని అన్ని కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని, మండల కేంద్రమైన రాయవరంలోనే ఎంపీపీ ఎస్ వేలంపేట, ఎంపీపీ ఎస్ మెయిన్ రాయవరం, ఎంపీపీ ఎస్ నెంబర్-1 రాయవరం పరీక్షా కేంద్రాలలో కలిపి మొత్తం 180 మంది అభ్యాసులు పరీక్షకు హాజరయ్యారని, ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగాయని, అభ్యాసులు నిబంధనలు పాటిస్తూ పరీక్ష రాసారన్నారు. ఈ పరీక్షలను ఎంపీడీవో, ఎంఈఓ, ఏపీఎం, ఏపీవో, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించగా, అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.


## విశ్వసనీయతకు విధేయతకు మారుపేరు వైసిపి కౌన్సిలర్స్

### మున్సిపాలిటీలో రికార్డు సృష్టించిన ధీరులు

### వైసిపి కౌన్సిలర్లకు ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో సత్కారం - ముగుస్తున్న కౌన్సిల్ పదవి కాలం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీలో సరిగ్గా ఐదేళ్ల క్రితం మండపేట చరిత్ర ను తిరగ రాసి టిడిపి కంచుకోట లాంటి పురపాలక సంఘంను ధీరులైన వైసిపి అభ్యర్థులు చేజిక్కించుకున్నారని రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. విశ్వసనీయతకు విధేయతకు మారుపేరైన మండపేట వైఎస్ఆర్సీపీ కౌన్సిలర్ లను ఆయన ఆదివారం సత్కరించారు. మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యాలయం లో జరిగిన కార్యక్రమానికి చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి తో సహా 15 మంది వైసిపి కౌన్సిలర్ లను ఆయన అభినందించారు. ఈ నెల 17తో కౌన్సిల్ పదవి కాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ 2021-2026లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ వారి కలలను సహకారం చేశారని కొనియాడారు. మంచి సలహాలతో ముందుకు తీసుకెళ్లిన కో-ఆప్షన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వారందరికీ జ్ఞాపికలను అందజేశారు. వైసిపి కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, మెర్నేని ప్రభావతి సత్యం,మండపల్లి రవికుమార్, శెట్టి కళ్యాణి, మెండు బాపిరాజు, నాయుడు లక్ష్మి సౌజన్య అయ్యప్ప, ముక్కా లోవ లక్ష్మీ దలీయ్యా, ముక్కా మేరీ స్వరూప రాణి సుబ్రహ్మణ్యం, జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు,నీలం దుర్గా సత్తిబాబు, మొండి భవాని మురళి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, ఏం ఎస్ శాంతి కుమారి లను సత్కరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వైసిపి కార్యదర్శి రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, ముమ్మిడివరపు బాపిరాజు, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, సిరిపురపు శ్రీనివాస్, పెంకే గంగాధర్, తణుకు అశోక్ పాల్గొన్నారు.

# నేటి నుంచే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

## విద్యార్థులు భయాందోళనలు విడిచిపెట్టి ధైర్యంగా పరీక్షలు రాయాలి : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

నేటి నుంచి ఉన్నత చదువులకు తొలిమెట్టైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళనలు విడిచిపెట్టి ధైర్యంగా పరీక్షలు రాసి విజేతలుగా నిలవాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. ఈ సమయంలో భయాందోళనలు రావడం సహజమే అయినప్పటికీ, సరైన ప్రణాళికతో ఒత్తిడిని అధిగమించి మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకుని స్థిరపడాలనే ఆశతో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదో తరగతి పరీక్షలేనని, ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఉన్నత చదువులకు మార్గం సుగమమవుతుందన్నారు. మార్చ్ 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 19,310 మంది విద్యార్థులకు 108 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులలో భయాందోళనలు తొలగించేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. అన్ని సబ్జెక్టులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ చదువు ప్రణాళిక రూపొందించుకోవాలని, కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. చదివేటప్పుడు ముఖ్యాంశాలను ఒకచోట రాసుకుంటే రివిజన్ సమయంలో సులభంగా ఉంటుందన్నారు. పరీక్షల సమయంలో రాత్రంతా మేల్కొని చదవడం కంటే కనీసం ఆరు గంటల నిద్ర అవసరమని తెలిపారు. దీని వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని, తగినంత నీరు తాగాలని సూచించారు. నేను బాగా రాయగలను అనే ఆత్మవిశ్వాసంతో చదువుపై దృష్టి పెట్టాలని తెలిపారు. నిరంతరాయంగా గంటల తరబడి చదవకుండా మధ్య మధ్యలో విరామం తీసుకోవాలని సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను ప్రాక్టీస్ చేయడం వల్ల పరీక్షా విధానం మీద అవగాహన పెరిగి సమయపాలన అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై



అతిగా ఒత్తిడి తీసుకురావద్దని, ఇతరులతో పోల్చకుండా వారికి ధైర్యం నింపాలని సూచించారు. ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూడాలని అన్నారు. పరీక్షలు మేధస్సుకు ఒక పరీక్ష మాత్రమేనని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. పరీక్షా పేపర్ చూసిన వెంటనే కంగారు పడకుండా ప్రశాంతంగా చదివి తెలిసిన సమాధానాలను ముందుగా స్పష్టంగా రాయాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యమైన అంశాలను పదేపదే రివిజన్ చేయాలని సూచించారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి కోనసీమ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. విద్యార్థుల వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని, పట్టుదల ఉంటే విజయం సొంతమవుతుందని అన్నారు. పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు తెలుపుతూ ధైర్యంగా పరీక్షలు రాసి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

**జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ తెలిపారు. రేపటి (సోమవారం) నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిరంతరం పెట్రోలింగ్ బృందాలు (బ్లూ కోల్ట్స్, రక్షక్) క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహిస్తాయని తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేలా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపులుగా ఎవరూ తిరగరాదని సూచించారు. పరీక్షా సమయాల్లో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేఫ్‌లు తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ (ఫ్రిస్కింగ్) చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, గందరగోళం లేకుండా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు, మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ

## కూళ్ళ గ్రామంలో రూ.కోటి రూపాయలతో త్వరలో ఆలయ నిర్మాణం
## కూళ్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో కోటి రూపాయల పుష్కర నిధులతో నిర్మించనున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా స్వామివారి విగ్రహాలను బాలాలయంలోకి తరలించే పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఈ ఆలయం అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.



**చిట్టూరి రామ్మోహనరావు సేవలు అభినందనీయం**

కూళ్ల గ్రామానికి టిడిపి నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయులు చిట్టూరి రామ్మోహన్రావు చేస్తున్న సేవలు అభినందనీయమని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఆయన సొంత నిధులను వెచ్చించి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

**డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి రక్షణ స్లాబ్ నిర్మాణానికి శంకుస్థాపన**

గ్రామంలో ఉన్న డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహం రక్షణ కోసం పై స్లాబ్ నిర్మాణానికి రూ.1.50 లక్షలతో చేపట్టనున్న పనులకు వాసంశెట్టి సత్యం, చిట్టూరి రవీంద్ర కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

**మత్స్యకారుల మార్కెట్ షెడ్ ప్రారంభం**

గ్రామంలోని మత్స్యకారుల సౌకర్యార్థం రూ.1 లక్ష వ్యయంతో నిర్మించిన మార్కెట్ షెడ్డును వాసంశెట్టి సత్యం, నాయకులుతో కలిసి ప్రారంభించారు. దీని ద్వారా మత్స్యకారులు తమ చేపలను విక్రయించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

**ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద సిమెంట్ బెంచ్‌ల ప్రారంభం**

అలాగే ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఎదురుగా రూ.60 వేల వ్యయంతో నిర్మించిన సిమెంట్ బెంచ్‌లను ప్రారంభించారు. ప్రజలకు విశ్రాంతి కోసం ఈ సదుపాయం ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కూళ్ల గ్రామ అభివృద్ధి కోసం చిట్టూరి రామ్మోహన్రావు చేస్తున్న సేవలను వాసంశెట్టి సత్యం, చిట్టూరి రవీంద్ర, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, టిడిపి గ్రామ అధ్యక్షులు చిట్టూరి సుబ్బారావు, డామినేని శ్రీనివాస్, కనకాల సుబ్బరాజు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా చెల్లుబోయిన శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

## టిడిపి శ్రేణులు, స్నేహితులు మధ్య జరుపుకున్న పుట్టినరోజు




**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తాటిపాకలో ఏర్పాటుచేసిన వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయుకులు,కార్యకర్తలు, స్నేహితులు, మీడియా మిత్రులు సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ముఖ్యఅతిథిగా రాజోలు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య పాల్గొని శ్రీనివాస్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తన జన్మదిన కావటం అలాగే నా స్నేహితులు అభిమానుల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని.. నా మీద చూపిస్తున్న ప్రేమ మరవలేనిదని, అలాగే ఎవరికి ఏ ఆపదలో ఉన్న నా వంతు సాయం చేస్తానని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాల మహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, రాజోలు మండలటిడిపి పార్టీ అధ్యక్షులు అనుచూరి పురుషోత్తం, మలికిపురం మండల పార్టీ అధ్యక్షులు ఆడబాల సాయిబాబా, సఖినేటిపల్లి మండలపార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, మామిడికుదురు మండలపార్టీ అధ్యక్షుడు, తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ప్రముఖ అడ్వకేట్, సీనియర్ నాయకులు సత్తిరాజు స్వామి. తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పిఎస్ నాయుడు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పిఎస్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాట్రేనికోనలో ఒక ప్రైవేటు భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రెస్ క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జగడ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా రంబాల శ్రీమహావిష్ణువు, మట్టపర్తి రవీంద్రనాథ్, కోశాధికారిగా గ్రంధి సూర్యనారాయణ గుప్తా (నానాజీ), ఉపాధ్యక్షులుగా కొంకి రవి,గోనె మదతల బ్రహ్మాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మల్లాడి మహావిష్ణువు బైరవ, మట్టపర్తి శ్రీహరి రావు, సహాయక కార్యదర్శిగా అయితా బత్తుల శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. కాట్రేనికోన మండలంలో మొట్టమొదటిసారిగా ఏర్పడిన ప్రెస్ క్లబ్ కు సంబంధించి స్థల సేకరణ, భవన నిర్మాణాల కోసం ప్రజా ప్రతినిధులు అధికారులు, సభ్యుల సహకారంతో కృషి చేస్తానని ఈ సందర్భంగా నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాశి చక్రి, బదుగు శ్రీనివాసరావు, కే సురేష్ కుమార్, ఎన్ రాంబాబు,నేలపాటి నాని బాబు,అయితే బత్తుల పండు బాబు,దార్ల రవి కుమార్, తాడి శ్రీనివాస్, కముజు సుందరయ్య, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కవులు సామాజిక చైతన్యంతో కవిత్వం రాయాలి

## అంతర్జాతీయ సాహిత్య సంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తి మండ ప్రతాప్




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కవులు సామాజిక చైతన్యంతో అభ్యుదయ భావాలతో కవిత్వం రాయాలని, కవులకు కళాకారులకు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, కవిత్వం అంటే మౌనానికి గొంతు ఇవ్వడమని, కవిత్వాన్ని పూజిస్తున్న సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక అని అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక అక్షర తపస్వి డాక్టర్ కత్తి మండ ప్రతాప్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట లో ఆదివారం ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నిర్వహణ సారథ్యంలో అత్యంత వైభవంగా జరిగిన జాతీయ శతాధిక ఉగాది కవి మ్మేళనం, ఉగాది పురష్కారాల ఉత్సవంలో.సామాజిక అభివృద్ధికి సహాయపడే సాహిత్యం అంతా అభ్యుదయ సాహిత్యం అవుతుందని ఆయన అన్నారు కవులను తయారు చేసే కర్మాగారం శ్రీ శ్రీ కళా వేదిక అని కత్తిమండఅన్నారు. కవి కాలానికి ముందు మాట రాయాలని ఆయన అన్నారు. కవి కవితలోని అభివ్యక్తి లో భావంలో కవితాత్మకంగా అక్షర శిల్ప నైపుణ్యంతో వాస్తవ రూప వైవిధ్యం చూపించాలని అప్పుడే కవికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఆ దిశగా కవిత్వం రాయాలని కవులను కోరారు . ఈ సందర్భంగా అత్యంత వైభవంగా ప్రతిష్టాత్మకంగా మూడు ప్రపంచ తెలుగు మహాసభ లునిర్వహించిన కిమ్స్ అధినేత కె వి వి సత్యనారాయణ రాజు చైతన్య రాజు ను తెలుగు భాషకు చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. సభ విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా కమిటీని అయన అభినందించారు. అంబాజీపేట గురజాడ సేవా సమితి అధ్యక్షులు అరిగేల బలరామమూర్తి మాట్లాడుతూ శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ స్థాయిలో 165 కవి సమ్మేళనం నిర్వహించి తెలుగు సాహిత్య చరిత్రలో కొత్త చైతన్యంతో డాక్టర్ కత్తి మండ ప్రతాప్ తెలుగు సాహిత్యనికి వెలుగు నింపుతున్నారని అన్నారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి టి పార్థసారథి మాట్లాడుతూ కవిత్వం అంటే అక్షర తాండవం కవిత్వంలో చెప్పేది బలంగా చెప్పాలని అప్పుడే హృదయానికి హత్తుకుంటుందని సామాజిక చైతన్యము రగిలించే కవిత వస్తే నిర్మాణం కవి తన కవితలో సాధన చేయాలని కవిత ధ్వనిపూర్వకంగా ఉండాలన్నారు. కాలంతో పాటు కవిత్వం మారాలని ఆయన అన్నారు కమాండెంట్ ఏపీ ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రవరం శంఖారావం వరల్డ్ ఫేమస్ కళా రత్న. కొండా నరసింహారావు అలివేలు మంగాదేవి దంపతులు. మాట్లాడుతూ శ్రీశ్రీ కళా వేదిక సీఈవో ప్రతాప్ చేస్తున్న సేవలు కొనియాడారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాట్లాడుతూ కొత్త తరం పాఠకుల మానసిక వికాసానికి ఉపయుక్తమైన సాహిత్య సృజన ద్వారా సమకాలీన సమాజంలోని సామాజిక అంశాలతో కవులు కవిత్వం రాయాలన్నారు. కత్తి మండ ప్రతాప్ తెలుగు సాహిత్యానికి చేస్తున్న సేవలను కొని ఆడారు. జిల్లా శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ కవులు రాసే కవితా వస్తువులో లీనం కావాలని అప్పుడే భావావేశం అక్షర రూపంలో కెరటంలా దూసుకు వస్తుందన్నారు. తెలుగు కవిత్వానికి వెలిగి నింపిన మహా కవులు శ్రీ శ్రీ, డాక్టర్ బోయి భీమన్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ,డాక్టర్ కత్తిమండ ప్రతాప్, టీ పార్థసారథి, జిల్లా కమిటీ కన్వీనర్ బి వి వి.సత్యనారాయణ, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్వి కొండా నరసింహారావు దంపతులు, కత్తిమండ ప్రతాప్, మహాకవి శ్రీనాథమహాకవి వారసులు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ .పార్థసారథి, నేనుపోలిశెట్టి అనంతలక్ష్మి దేవి ,అరిగెల బలరామమూర్తి, పేరి కామేశ్వరరావు , జిల్లా కన్వీనర్ బి .వి.వి సత్యనారాయణ 150 మంది కవులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కిమ్స్ వైద్య కళాశాల వైస్ చైర్మన్ మోహన్ రాజు వీఆర్వో రాధా మనోహర్ లను కత్తిమండ ప్రతాప్ ,కొండ నరసింహారావు, కావూరి శ్రీనివాస శర్మ ఘనంగా సన్మానించారు. జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం లో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా, ఒరిస్సా, , తమిళనాడు రాష్టం నుండి 150మంది కవులు ఉగాది కవి సమ్మేళనంలో తమ కవితల ద్వారా అక్షర విందును అందించారు.

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న

# వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి


## షేక్ వల్లి బాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఇఫ్తార్ విందు




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం షేక్ వల్లి బాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేస్తూ, రంజాన్ మాసం శాంతి, సహనం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### రావులపాలెంలో

# అక్షరాంధ్ర తుది పరీక్షలు పరిశీలన



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలంలో నిర్వహించిన అక్షరాంధ్ర తుది పరీక్షా కేంద్రాలను కొత్తపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. మండలంలోని వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ విధానాన్ని సమీక్షించారు. మండలంలో మొత్తం 72 పరీక్షా కేంద్రాల్లో అక్షరాంధ్ర తుది పరీక్షలు నిర్వహించగా, 2,307 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా జరిగాయని పేర్కొన్నారు. ఈతకోట, దేవరపల్లి గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలను కూడా ప్రత్యేక అధికారి సందర్శించి ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, పరీక్షల నిర్వహణపై అధికారులతో చర్చించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపీడీఓ అమరనాథ్, ఏపీఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో


# ఘనంగా అధ్యాయనోత్సవాల ఆరంభం





**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అధ్యాయనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు.ఉదయం ఆలయంలో తీర్థ బిందె నదీజలాల సేకరణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి సహిత లక్ష్మీ హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. తరువాత నిత్యసేవలో భాగంగా దివ్యప్రబంధ పారాయణం నిర్వహించారు.సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని పల్లకీ సేవతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్ రాజు),ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న నిత్య అన్నప్రసాదానికి రూ.1.01 లక్షల విరాళం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వీరవాసరం మండలం లోని మత్స్యపురి గ్రామానికి చెందిన జవ్వాది సూర్యనారాయణ మూర్తి కుటుంబ సభ్యులు సేవా భావంతో వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ విరాళాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా జవ్వాది సూర్యనారాయణ మూర్తి చి:ప్రణవి రామ హృద్య పేరున కుటుంబ సభ్యులు ఆలయ అధికారులకు విరాళం అందజేసి అన్నప్రసాద సేవకు తమ వంతు సహకారం అందించారు. భక్తులకు ప్రతిరోజు నిర్వహించే నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఈ విరాళాన్ని సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు, అర్చకులు దాతల సేవాభావాన్ని అభినందించారు. స్వామివారి సేవలో భాగస్వాములైనందుకు వారికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమం ద్వారా ప్రతిరోజు పెద్ద సంఖ్యలో భక్తులకు ప్రసాదం పంపిణీ జరుగుతోందని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామి చిత్ర పటాన్ని తీర్థప్రసాదాలు అందజేశారు ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# దారితప్పి దరికొచ్చిన పులి ... దారికొచ్చే దారేదీ ...?!

## పులిని బంధించేందుకు టైగర్ క్యాచర్ ఆగమనం - అధికారులు, ప్రజలు అప్రమత్తం











**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పొరపాటో... గ్రహపాటో... కావాలనో దారి తప్పి ప్రజల దరికొచ్చిన వన్యప్రాణి పులి ఎట్టకేలకు పట్టుబడే దారేదీ కనపడటం లేదు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు, శంఖవరం మండలాల పరిధి లోనికి వచ్చి సరిగ్గా ఆదివారం నాటికి 10 రోజులు అవుతోంది. ఆనాటి నుంచీ దాని గమనాన్ని ఎప్పటి కప్పుడు అత్యంత తెలివిగా మార్చుకుంటోంది. దానిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న అటవీశాఖ అధికారులకు చిక్కకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని గోదావరి నది ఒడ్డున, రాజమహేంద్రవరానికి సుమారు 60 కిలో మీటర్ల దూరంలో దాదాపు 1,012.86 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన దట్టమైన పాపికొండల అభయారణ్యం అడవుల్లో ఈ పులిని గతంలో కొన్ని నెలల క్రితం విడిచి పెట్టారు. అప్పట్లోనే దీనికి వి.హెచ్.ఎఫ్ శాటిలైట్ రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నల్ పరికరాన్ని అమర్చారు. ఈ జాతీయ ఉద్యానవనం నుంచి దారి తప్పి దాదాపు 120 కిలో మీటర్ల దూరం ప్రయాణించి ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి 10 రోజుల క్రితం ప్రవేశించిన ఈ బెబ్బులి శంఖవరం, ప్రత్తిపాడు మండలాల్లో దాదాపు మరో 20 కిలో మీటర్లు దూరం ప్రయాణించి ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి మండపం పొలాల్లో సంచరిస్తున్నది. మండపం నుంచి శంఖవరం వైపు వచ్చే దారిలో నూకాలమ్మ, వేపారమ్మ తల్లుల గుడుల సమీపం ప్రాంతాల్లోనూ, అలాగే ఆ రెండు గ్రామాలకూ మధ్య ఉన్న వంతెన వద్ద, ఆ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తోంది. వంతెన వద్ద పంపా రిజర్వాయర్ కాలువ నీటి వనరు ఉండటంతో తాగునీటికి వంతెన వద్ద సంచరిస్తున్నదని అంటున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు ప్రత్యక్ష



పర్యవేక్షణలో అటవీ, రెవిన్యూ, పంచాయతీ శాఖల అధికారులు మాత్రం అప్రమత్తంగా ఉన్నారు. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య జన సంచారాన్ని అటవీశాఖ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. పొలాల్లోని పెంపుడు జంతువులను సైతం మండపంలోనికి తెచ్చుకునేందుకు పులి పరిసరాల్లోనికి వెళ్లేందుకు రైతులనూ అనుమతించ లేదు. గ్రామంలో ముందస్తు జాగ్రత్తలు, హెచ్చరికలూ జారీ చేశారు. రోజు రోజుకూ ఎంతో కొంత ప్రజలు, అధికారుల మాటుకు దాదాపు దగ్గరకు పులి వచ్చినా తరచుగా తన స్థానాన్ని పులి మార్చుకుంటూ వస్తున్నందున ఇప్పటి వరకూ బంధించడం సాధ్యం కాకుండా పోయింది. దీంతో పులిని పట్టుకునే దారేదీ అని అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

**టైగర్ క్యాచర్ డాక్టర్ సత్య ప్రకాష్ అరుణ్ ఆగమనం**

బీహార్ రాష్ట్రం స్థానీయుడు, తిరుపతిలో ఓ కుటుంబానికి అల్లుడు. తిరుపతిలోనే నివాసం ఉంటున్న టైగర్ క్యాచర్ డాక్టర్ సత్య ప్రకాష్ అరుణ్ మండపంనకు వస్తున్నారు. ఈయన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. ఈయన తిరుపతి పశువైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత తిరుపతి జంతు ప్రదర్శనశాలలో డాక్టరుగా బాధ్యతలను చేపట్టి దాదాపుగా 20 సంవత్సరాలుగా అదే జూలో పని చేస్తున్నారు. భారత దేశంలోని పలుచోట్ల పులులు సంచరించు ప్రదేశాల్లో పులులకు మత్తు మందు ఇచ్చి బంధించటంలో పలుమార్లు తన నిపుణతను ప్రదర్శించారు. పులులను బంధించటంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకొని ఎక్కడ పులులు సంచరించినా అక్కడకు వెళ్లి విజయవంతంగా పులులను పట్టుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను సొంతం చేసుకున్నారు. ఈయన ఆదివారం సాయంత్రం 5 గంటలకు తిరుపతిలో బయలు దేరారు. అర్ధరాత్రికి ఈయన శంఖవరం మండల మండపం చేరుకునే అవకాశం ఉంది.

# పులి సంచారంపై అప్రమత్తం చేసిన వైద్యుడు రాజీవ్...!

## ఫోన్లు, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం - అప్రమత్తమైన శంఖవరం, మండపం ప్రజలు- వైద్యుని సామాజిక బాధ్యతకు ప్రజలు ఫిదా



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇదిగో పులి అంటే... అవునవును ఇదిగో తోక... నువ్వు చెబితే గానీ మాకు తెలియదు మరి... వెళ్ళు వెళ్ళవయ్య నీ పనేదే నువ్వు చూసుకో... అని హేళనగా ఎదురు సలహాలు ఇచ్చే ఈ రోజుల్లో... ఓ పులి సంచారంపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఓ సామాజిక బాధ్యతను అప్రతిహతంగా నెరవేర్చిన అసమాన వైద్యుని కృషి ఫలించింది. రెండు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసింది. వైద్యో నారాయణ హరిః (వైద్యుడే దేవుడు) అన్న సామెతను నిజం చేస్తూ సాక్షాత్తూ ఆ నారాయణుడే ఈ నర నారాయణుడితో చెప్పిస్తున్నాడా అన్నట్లు... పులి నుంచి ప్రజలను దూరం చేసేందుకు ప్రజలను అప్రమత్తం చేయడంలోని ఆ వైద్యుని నీతి, నిజాయితీ, నిబద్ధత, సామాజిక బాధ్యతను ప్రజలు అభినందించకుండా ఉండలేక పోతున్నారు. ఆ అభినందనీయ వైద్యుడే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం (మండల) ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిడిఓ. శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్. మండలంలోని గొంధి కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాల నుంచి పులి శనివారం రాత్రికి శంఖవరం చేరుకుందన్న విషయాన్ని అన్నవరం పోలీసుల ద్వారా ధృవీకరించుకున్న రాజీవ్ కుమార్ శంఖవరం, మండపం గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మొదటి దఫా తన ఆస్పత్రి సిబ్బంది వాట్సాప్ గ్రూపుల్లో కృతి సందేశాలు, శబ్ద సందేశాలను బట్వాడా చేసారు. ఆ తర్వాత మిగతా సామాజిక మాధ్యమాల్లో వాటిని ప్రచారం చేశారు. రెండో దఫాలో మండపం, శంఖవరం గ్రామాల్లోని తనకు అందుబాటులో ఉన్న చరవాణీలకు ఫోన్ చేసి మాట్లాడారు. శంఖవరం ఊర కొండకు పులి చేరుకున్నదనీ, ఆ తర్వాత మండపం, అన్నవరం తదితర ప్రాంతాల్లో సంచరించే అవకాశం ఉందని, నాకు పోలీసుల ద్వారా విశ్వసనీయంగా తెలిసింది. మీరు ఇంటి తలుపులు జాగ్రత్తగా బిగించు కోవాలని, ఇంటి లోపల బయటా విద్యుత్తు దీపాలను తెల్లవార్లూ వెలిగించే ఉండాలని, రాత్రిళ్ళు ఎవరూ ఇంటి ఆరుబయట తిరగొద్దని, మైక్ సెట్ లతో పెద్ద పెద్ద శబ్దాలు చేయాలని... అలా చేస్తే పులి జనసంచారం వైపునకు రాదని ప్రచారం చేసారు. 104 వాహనాలను సిద్ధంగా ఉంచామనీ, ఆస్పత్రిలో మందులూ, సిబ్బందినీ సిద్ధంగా ఉంచామనీ రాత్రి 1 గంట వరకూ ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉన్నారు యువ వైద్యులు రాజీవ్ కుమార్.మ రాత్రి 11 గంటల సమయంలో పులి శంఖవరం ఊరి చివరకు వచ్చింది. పులి కదలికలు రాత్రి పూట ఎక్కువగా ఉంటాయి. కాబట్టి శంఖవరం, కొంతంగి, కొంతంగి కొత్తూరు, నెల్లిపూడి, మండపం, అన్నవరం, కత్తిపూడి గ్రామాల ప్రజలు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి. అటవీ ప్రాంతంలో మకాములు ఉన్నవాళ్లు వెంటనే అవి ఖాళీ చేసి గ్రామంలోకి రావాలని, ఇంటి బయట ఉండే లైట్లు వేసుకోవాలని, గ్రామాల్లోని ఆలయాలపై ఉన్న మైక్ సెట్ సౌండ్ రాత్రంతా కూడా పూర్తిగా పెట్టాలనీ, ఒంటరిగా ఎవరూ ప్రయాణం చేయొద్దని, ముఖ్యంగా రైతులు పొలాల్లోకి రాత్రులు వెళ్లకుండా ఉండాలని ప్రజలు సురక్షితం పట్ల ఎంతో ఆపేక్షతో మరెంతో ఓర్పుగా ప్రచారం చేశారు ఈ ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కార గ్రహీత డాక్టర్ శెట్టి బత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్. అందుకే ఆయన వేనోళ్ళ అభినందనలు అందుకుంటున్నారు. పులి కడుపున పులే పుడుతుందని తండ్రికి మించిన తనయుడు ఈ శ్రీరామ రాజీవ్ కుమార్ శెట్టిబత్తుల నిరూపించారు. దీర్ఘాయుష్మాన్భవ ...

# జర్నలిస్ట్‌గా బ్రతకాలి అంటే పాలకులు, నేతల నేరాలను కప్పి పుచ్చాలి

## - జర్నలిజం అంటే అక్షరాన్ని అమ్ముకోవటమా..! నమ్ముకోవటమా ..! - సజీవ దహనం అయిపోతున్న మీడియా విలువలు రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్ ఆవేదన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 1000/-కోట్లు నిధితో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా మీడియా సంస్థలకు ఒక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని,జర్నలిస్ట్ లకు భద్రత - భరోసా కల్పించాలని, జర్నలిస్ట్ గా బ్రతకాలి అంటే పాలకులు, నేతల నేరాలను కప్పి పుచ్చాలి అని (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సందర్భంగా మీడియా తో మేడా మాట్లాడుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన మీడియా కొన్ని వ్యాపార రాజకీయ , కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందిగా చిక్కుకు పోయిందన్నారు.ఒక వాస్తవ ఘటనను నిజాయితీగా వార్తగా చూపించే ప్రయత్నం చేస్తున్న ఒక జర్నలిస్ట్ తపనను మరో కిరాయి జర్నలిస్ట్ చేతనే ఆ వార్తపై బురద జల్లించే కోణంలో తెర వెనుక కొన్ని రాజకీయ శక్తులు ,కొన్ని కార్పొరేట్ మాఫియా శక్తులు మరో తప్పుడు జర్నలిజం వార్తను ప్రచారం లోకి తెస్తు వాస్తవాన్ని గమనించ లేని సామాజిక కాలుష్యాన్ని సృష్టిస్తున్నారు. కొంతమంది భయంతోను, కొన్ని బలహీనతలతోను, కొన్ని సొంత ప్రయోజనాల కోసం వ్యాపార రాజకీయ పార్టీలకు, విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థ లకు శాశ్వత బానిసలుగా మారి పోతున్నారు. ఈ తరహా జర్నలిస్టులు ఎక్కువ శాతం నిరుత్సాహంతోను, వేధింపులను తాళలేకనో అనే అబద్రతలకు లోనై పవిత్ర మైన జర్నలిజం సమాజానికి శాపంగా మారి వ్యవస్తీకృత నేరాల చూస్తూనే ఆజన్మాంత కభోదిలుగా మౌనమే అస్త్రంగా జీవిచేయటానికి అలసటతో అలవాటుగా మారిపోతున్నారు. నేడు మీడియాను ముందుకు నడపటం అంటే కత్తి మీద సాము చేయటం వంటిది. పులిమీద స్వారి చేయటం వంటిది. ఒకప్పుడు మీడియా వ్యవస్థను ప్రోత్సహించే సామజిక ప్రభుత్వాలు ఉండేవి. నేడు ఓటును, వార్తను ఒకే విధంగా డబ్బుతో నడిపించే ప్రభుత్వాలే నేడు శాసన కర్తలుగా వుంటున్నారు. ఆ వార్త ప్రచురించిన సంస్థ ను గౌరవించేవారు. భయపడే వారు. అభినండించే వారు.నేడు నిజాన్ని వార్తగా ప్రచురిస్తే దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు.అక్రమ కేసులు బనాయిస్తు జర్నలిస్ట్‌ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నారు. నేడు జర్నలిస్ట్‌గా బ్రతకాలి అంటే పాలకులు, నేతలు చేస్తున్న నేరాలను కప్పి పుచ్చాలి. సందర్భాన్ని బట్టి వాస్తవ వార్త ప్రచురించిన జర్నలిస్ట్‌పై బురద జల్లించాల నేదే నేటి జర్నలిజంగా సాగుతుం దన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాల యాలు అవినీతి నేరాలకు కేంద్ర బిందువుగానే వున్నాయి. వార్త వ్రాసే సాహసం మాత్రం ఏ జర్నలిస్ట్ చేయలేక పోతున్నారు . ఎందుకంటే హక్కులను రక్షించే వ్యవస్థలు నేడు లేవు. వార్త వ్రాయటం కన్నా ఆ అవినీతిలో భాగస్వాములుగా చేయి చాచటమే ఉత్తమ మైన మార్గంగా మలుచుకుంటున్నారు. భద్రత లేని జర్నలిజంకు నేటి సమాజం కన్నీటి పర్యాంతకంగా మారుతుంది. ప్రస్తుత మీడియా వృత్తి ఒక రకమైన మత్తుగా మారిపోయింది . వ్యవస్థలో కీలకమైన రాజకీయ రంగం, పోలీస్, రెవిన్యూ, ఇతర మాఫియా నేతలతో నిత్య పరిచయాలు తన భవిష్యత్ ను, బిడ్డల అభ్యున్నతిని, సామజిక భద్రతను, భాద్యతలను మరిచిపోయేలా చేస్తున్నాయి . ప్రస్తుతం కొన్ని మీడియా సంస్థల పనితీరు హమస్ వంటి ఉగ్రవాదాన్ని మెప్పించే విధంగా వుంటుందని , కొన్ని విలువలుతో కూడిన వృత్తులు కలుషితం చెండటం రాజ్యాంగ విద్రోహ చర్య కన్నా ప్రమాదం అని ఆయన తీవ్ర ఆందోళన చెందారు. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రల్లో కొన్ని మీడియా సంస్థల వార్తలు ఎవరికి ఉపయోగమో , ఎవరికి మేలు చేస్తున్నాట్టో మెరుగైన సమాజానికి అర్థం కాకుండా పోతుందన్నారు. ఆ మీడియా సంస్థల వార్తలు చదివినా, వీక్షించినా గంజాయి, హెరైన్, కోకైన్ వంటి ప్రమాదకర మైన మత్తు ప్రధార్దాలకు బానిసలుగా మారినట్టేనన్నారు. అధికారిక ప్రభుత్వ తోడ్పాటు లేకుండా మీడియా రంగాన్ని నిర్వహించడం సామాన్య జర్నలిజంకు సాధ్యం కాదు. నేటి సామాజిక ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఖరీదైన పద్ధతుల్లో మీడియా నిర్మాణ రంగాలను లాభాల బాటల్లో నడిపిస్తున్నారంటే జర్నలిజం తోనా! ఆ ముసుగులో ఎర్నలిజం తోనా అనే సందేహాలను ప్రజలను, సమాజాన్ని నిత్యం వెంటాడుతున్న ప్రశ్నలన్నారు . ఒక సంపన్న వర్గానికో, వ్యాపార ప్రైవేట్, కార్పొరేట్ సంస్థకో, అనుకున్న రాజకీయ పార్టికో అనుకూల మైన కట్టప్ప వార్తలు కాకుండా సామాజిక స్పృహతోను, భాద్యత తోను మీడియా కధనాలు ప్రచురించే ఏ ఒక్క కార్పొరేట్ మీడియా అయినా నేడు ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాల్లో వుందా! అని అన్నారు. నేడు ఒక రకమైన ఆ మీడియా సంస్థలను ప్రజలు అనుసరించటం కూడా సామజిక ఉన్మాద ఉగ్రవాద చర్యల్లో ఒక భాగమేనాన్నారు . భారతదేశ అత్యున్నత ప్రజాస్వామ్యంలో నాల్గొవ శక్తిగా పిలవబడే ప్రతిష్ట గల మీడియా వ్యవస్థ నేడు ప్రజలతో కీర్తింప బడుతుందా! అనే ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన భాద్యత ప్రతి పౌరుడు కర్తవ్యం అన్నారు. నేడు దూమపానం, మద్యపానం, చతుర్ముఖ పారాయణణం వంటి ఇతర చెడు మత్తు ప్రధార్దాలకు బానిసలుగా మారకపోయినా పరవాలేదు . ఆ కొన్ని మత్తు మీడియా వార్తలు చదవక పోయినా, వీక్షించక పోయిన వాళ్ళు మాత్రమే భాద్యత గల ఉత్తమ పౌరులు అనే వాదన రోజు రోజుకు ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసం అని ఆయన పేర్కొన్నారు. నేటి జర్నలిజం అంటే అక్షరాన్ని అమ్ముకోవటమే వృత్తి ధర్మం అన్నట్టుగా పాలకుల పనితీరు వుంటుందని , అక్షరాన్ని నమ్ముకుంటే వేధింపులు , అవమానాలు తప్పవు అన్నట్టుగా పరిస్థితులు సామాన్య మీడియా ప్రతినిధులను వెంటాడుతున్నాయి . వర్ధమాన సిని నటి ప్రత్యూష , అయేషా మీరా, సుగాలి ప్రీతి మరణాలపై వారి తల్లులు చేస్తున్న పోరాటాలపై , వెలుగు చూడని అనేక ఘోర ఘటనలపై , రాజమండ్రిలో ఒకే కుటుంబంలో జరిగిన 5 మిష్టరి హత్యలపై , తూర్పుగోదావరి జిల్లాలో ఒక ఆమాత్యుడి ప్రొద్బలంతో జరిగిన ఒక పోలీస్ లాకప్ మరణం పై దృష్టి ఏ కార్పొరేట్ మీడియా ద్రుష్టి సారించదు. వార్త ప్రచురించదు. భారతదేశంలో ఎఫ్టిన్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బిల్ గేట్స్ హెచ్ పి వి వంటి ఉచిత కేన్సర్ వ్యాక్సిన్ లో దాగి వున్న మర్మం కోసం ప్రజలకు తెలియపరచరు. ఇలాంటి ఘటనలు మన ప్రభుత్వాలకు అక్కరలేదు. కార్పొరేట్ మీడియాకు ఆ వార్తలు అవసరం లేదు. నేటి మీడియా విలువలు అంటే సామజిక ప్రతిష్టను మంటగలపటమేనన్నారు. విభజన సమయంలో కేంద్రం ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాలకు జరిగిన అన్యాయాలపై ఏ ఒక్క కార్పొరేట్ మీడియా లోతైన వార్తలు వ్రాయలేదు. నిజాలను చూపించలేదు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభావాలను రాజకీయ ముడి సరుకుగా మార్చుకుని కిరాయి కార్పొరేట్ మీడియా వార్తలతో నిజాలను దారిమళ్ళించేశారు. ప్రజలు ఆలోచనా శక్తి కోల్పోయే విధంగా ఏదో ఒక కొత్త కొత్త సమస్యలను సృష్టిస్తూనే వుంటున్నారు. రాష్ట్ర విభజనతో ఎవరు లబ్ధి పొందారు. పునర్విభజన చట్టం అమలు జరిగిందా ! రెండు తెలుగు రాష్ట్రాల భవిష్యత్‌కు దీర్ఘాకాలిక సమస్యల పరిష్కారం లేకుండా విభజన జరిపించారా! అనే నిజాన్ని ఏ కార్పొరేట్ మీడియా ప్రజలకు తెలియ చేయక పోవటం విద్రోహ చర్య కాదంటారా! రెండు తెలుగు రాష్ట్రాల నుండి పునర్విభజన చట్టంపై పార్లమెంట్‌లో పునర్చర్చకు అనుమతి తీసుకుంటేనే రెండు తెలుగు రాష్ట్రాలకు అద్భుతమైన భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. ఈ అంశాలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి కేంద్ర ప్రభుత్వం నిధుల సహాయంతో ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాలుకు 1000 /- కోట్లు నిధితో మీడియా కార్పొరేషన్ బోర్డు ను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతా చర్యలకు మెరుగైన సంస్కరణలను అమల్లోకి తేవాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ సిమ్మా దుర్గారావు, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, కారుమూరి యుగంధర్, దోషి నిషాంత్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, దుడ్డే త్రినాద్, వాడపల్లి జ్యోతిష్, దోషి నిషాంత్, కాకర ప్రసాద్ , సింహాద్రి తిలక్, చల్లా శివ దుర్గాప్రసాద్, మాసా అప్పాయమ్మ, అడపా శేషగిరి, యర్రా బాల మురళి కృష్ణ, మాసా ప్రమీల, మాసా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# మత సామరస్యం, సోదరభావం మన సంస్కృతి

- మార్గాని భరత్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు
- ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ పార్లమెంటు సభ్యులు మార్గాని భరత్ రామ్ ఆదివారం సాయంత్రం మంజీరా కన్వెన్షన్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పార్టీ సి.ఈ.సి సభ్యులు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, మాజీ రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి గుర్రం గౌతం రామ్, దాసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు, మత గురువులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. భరత్ మాట్లాడుతూ, "మత సామరస్యం, సోదరభావం మన సంస్కృతి మూలస్తంభాలు. అందరం కలిసి జీవించడమే వైఎస్సార్‌సీపీ భావజాలం" అని అన్నారు. పవిత్ర ఖురాన్ పఠనం, ప్రార్థన అనంతరం సమూహ ఇఫ్తార్ నిర్వహించారు. మన ప్రభుత్వ హయాంలో ఆవ రోడ్ లో షాదిఖానా కు స్థలం మనం చూసుకున్నాము కానీ అది ఆచరణలోకి రాలేదు, మరల జగన్ భాయ్ అధికారంలోకి వచ్చినవెంటనే ఆ హామీ నెరవేర్చే బాధ్యత నేను తీసుకుంటానని భరత్ తెలిపారు. జగన్ భాయ్ మైనారిటీస్ పక్షపాతి అని, మన కోసం ఏమన్నా చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. పార్టీ నేతలు ఈ కార్యక్రమాన్ని మత సమైక్యతకు చిహ్నంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పిల్లలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు వార్డు ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి దేవస్థానంలో

# షాపుల అద్దె హక్కుల టెండర్



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో ఉన్న శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని శ్రీ ఉమా కమండలేశ్వర షాపింగ్ కాంప్లెక్స్‌లో గల ఐదు దుకాణాల అద్దె హక్కుల కోసం టెండర్-కమ్-పబ్లిక్ ఆక్షన్ నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ బందెల సత్తిపండు,ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి తెలిపారు. ఈ దుకాణాల అద్దె హక్కులను మూడు సంవత్సరాల కాలపరిమితికి (2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు) కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 17న ఉదయం 10 గంటలకు దేవస్థానం కార్యాలయం వద్ద దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో టెండర్-కమ్-పబ్లిక్ ఆక్షన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వ్యక్తులు టెండర్ ప్రక్రియలో పాల్గొని దుకాణాల అద్దె హక్కులను పొందవచ్చని తెలిపారు. టెండర్ నిబంధనలు, అర్హతలు తదితర పూర్తి వివరాల కోసం దేవస్థాన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

### ఆరోగ్యకరమైన జీవితం కోసం

# సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి

**- లైఫ్‌లో ప్రతి ఒక్కరికి ఫిట్ నెస్ చాలా అవసరం - ప్రిజం, టోనఫ్ జిమ్ ఆధ్వర్యంలో 3కె రన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**
**- యువతను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతాం : ఎం.డి కృష్ణ తేజ**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యకరమైన జీవితం జీవించాలంటే ప్రతి వ్యక్తి వ్యాయామం కోసం సమయం కేటాయించాలని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పిలుపు ఇచ్చారు. ఆదివారం ఏ.వి అప్పారావు రోడ్ లోని ప్రిజమ్ మరియు టోన్ అప్ జిమ్ ఆధ్వర్యంలో3 కే రన్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు జెండా ఊపి 3 కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడు తూ లైఫ్ లో ఫిట్నెస్ చాలా అవసరమని అన్నారు ఆరోగ్యకరమైన జీవితం లేకపోతే చేయగలిగేది ఏమీ లేదని వివరించారు. 40 సంవత్సరాలు దాటిన తరువాత దాని విలువ తెలుస్తుందని తెలిపారు. వ్యాయామం కోసం ప్రతి వ్యక్తి రోజులు కొంత భాగం సమయాన్ని కేటాయించాలని సూచించారు. సమయం లేదని అంటున్నారంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నట్టేనని వివరించారు. వ్యాయామం కోసం తప్పనిసరిగా సమయం కేటాయించాలని తెలిపారు. వ్యాయామం విషయంలో తనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తి అని అన్నారు. ఈ సందర్భంగా ప్రిజమ్ మరియు టోన్ అప్ జిమ్ ఏం.డి కృష్ణ తేజ మాట్లాడుతూ యువతలో ఆరోగ్యం పై శ్రద్ధ పెంపొందించే చేందుకే జిమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు జిమ్ ను ఉపయోగించుకొని ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని సూచించారు. 3 కే రన్ ఏవి అప్పారావు రోడ్ లోని ప్రిజమ్ జిమ్ నుంచి బయలుదేరి రామాలయం సెంటర్ కు చేరుకుని, అక్కడ నుంచి తిరిగి ప్రిజం జిమ్ కు చేరుకుంది. విజేతలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువకులు,మహిళలు పాల్గొన్నారు.

# విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి కంపెనీ ప్రారంభం






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్లాస్ తయారీ సంస్థ విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి కంపెనీని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరం సమీపంలోని ఇండస్ట్రియల్ కాలనీలో ఆదివారం ప్రారంభమైంది. విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పిని రాజమహేంద్రవరం సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు), ఎపిఐఐసి మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం, ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తవ్వా రాజాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల కేంద్రంగా ఇక్కడ ఏర్పాటు చేసిన గ్లాస్ తయారీ కంపెనీ ఈ ప్రాంతంలోని నిర్మాణ రంగానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. గతంలో గృహ, ఇతర అవసరాలకు అవసరమైన గ్లాస్‌ను విజయవాడ, విశాఖ పట్నంల నుండి తెచ్చుకోవాల్సి వచ్చేదని, దీని వల్ల రవాణా ఖర్చులతో పాటు, సమయం కూడా వృదా అయ్యేదన్నారు. ఇక్కడ విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి కంపెనీ అందుబాటులోకి రావడం వల్ల రవాణా ఖర్చులు, సమయం కూడా ఆదా అవుతుందన్నారు. బిల్డర్‌లు సహకరంచాలని అన్నారు. విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి కంపెనీ యం.డి సురేంద్ర మాట్లాడుతూ విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి వల్ల ఇక్కడ బిల్డర్‌లు, ఆర్కిటెక్చర్‌లు, ఇంటీరియర్స్‌కు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. గ్లాస్ అనేది చాలా సున్నితమైన వస్తువని, దీని ట్రాన్స్‌పోర్టు అనేది చాలా ఖర్చుతో కూడుకున్నదన్నారు. దగ్గరలోని గ్లాస్ తయారీ ఫ్యాక్టరీ అందుబాటులో ఉండటం వలన రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతుందన్నారు. విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి ద్వారా 45 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 1992 నుంచి ట్రేడింగ్‌లో ఉన్నామని, ఇప్పుడు ప్రొడక్షన్‌లో అడుగుపెట్టామన్నారు. ఇప్పటిదాకా ట్రేడింగ్‌లో ఉండటం వల్ల ఇక్కడ డీలర్‌ల, వినియోగదారుల అవసరాలు, అభిరుచులు తమకు బాగా తెలుసునని, వారి అభిరుచులకు అనుగుణమైన నాణ్యమైన ప్రొడక్ట్‌ను అందించే విధంగా తమ సిబ్బందిని సన్నద్ధం చేయడం జరిగిందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి డీలర్‌కి, కస్టమర్‌కి పర్ఫెక్ట్ ప్రొడక్ట్ అందజేయగమని అన్నారు. ముడిసరుకు అంతా కూడా సెయింట్ గోబెన్, అసాయి వంటి మల్టీనేషనల్ కంపెనీస్ నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. ఫ్యాక్టరీని మరింత విస్తరించే ప్రణాళికలు ఉన్నాయన్నారు. స్టార్టప్ కంపెనీలకు మేక్ ఇన్ ఇండియాలో అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఇక్కడ ఈ ఫ్యాక్టరీ నెలకొల్పామన్నారు. బిల్డర్‌లు నుండి మంచి సహకారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్‌పి కంపెనీ పార్టనర్‌లు సాయి, హరి సాయి, శ్రీకాంత్, హేమంత్, నగరంలోని ప్రముఖ బిల్డర్‌లు, వ్యాపారవేత్తలు మన్యం ఫణి, తొంటెపు రామలింగేశ్వరస్వామి, వంకాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాలి

**విద్యాహక్కు చట్టం అమలు చేయడంలో ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్లక్ష్యం**
**- ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలి**
**- ఉచిత విద్య, విద్యార్థుల, తల్లిదండ్రుల అసోసియేషన్ విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం పేద పిల్లల విద్యాభివృద్ధికి తీసుకువచ్చిన విద్య హక్కు చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము సత్తిబాబు, ఏ.సుధీర్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో స్థానికంగా నగరంలో ఒక చర్చిలో తల్లిదండ్రుల తో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు,చిన్న నారాయణ మీడియాతో మాట్లాడుతూ, చట్టం అమలు చేయడంలో ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, సంబంధిత విద్యాశాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం అమల్లోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్నప్పటికీ, సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు వర్గాలు ప్రచారం చేయడం లేదని, అవగాహన లేక వేలాది మంది పేద కుటుంబాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రాష్ట్రవ్యాప్తంగా అసోసియేషన్ చొరవ తీసుకుని ఆన్లైన్లో వెయ్యి రిజిస్ట్రేషన్లు చేయగలిగామని, మార్చి 10వ తేదీతో గడువు ముగిసిందన్నారు. ఈ గడువును మరో వారం రోజులపాటు పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల కోనసీమ జిల్లాకు చెందిన మండపేట నియోజకవర్గ తూర్పుగోదావరి జిల్లాలో కలిసిందని, ఈ జిల్లాలో ఆన్లైన్ పోర్టల్ లో ప్రైవేటు విద్యాసంస్థలు కనిపించడం లేదని ఈ సమస్యను మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. నగరంలో పెద్ద ,పెద్ద ప్రైవేటు విద్యాసంస్థలు సీట్లు ఇవ్వడం లేదని, ఇటువంటి విద్యా సంస్థల లైసెన్స్ లను, రాయితీలను ప్రభుత్వం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం 12(1) సి అమలు చేయని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల పై హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఏ సుధీర్ మాట్లాడుతూ, ప్రైవేటు విద్యాసంస్థలు 12(1) సి సెక్షన్ ప్రకారం 25% అమలు చేయకపోవడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న వారు కాలక్షేపం చేస్తున్నారని పేద వర్గాలను పట్టించుకోవడంలేదని, ఆవేదన చెందారు. ఉపాధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో వేలాది సీట్లు మిగిలిపోతున్నాయని, రకరకాల ఫీజుల పేరుతో యాజమాన్యాలు దోసుకుంటున్నారని, పేద వర్గాలు నష్టపోతున్నారని వాపోయారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసు గణేష్, తగరం సురేష,అంబేద్కర్ ,తేజస్విని ,దీవెన, దుర్గ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

### ఐక్యత సోదరభావం దాతృత్వానికి

# ఇఫ్తార్ విందులు చిహ్నంగా నిలుస్తాయి

**ఇఫ్తార్ విందులో చైర్ పర్సన్ రాణి**



**మండపేట టౌన్, విశ్వంవాయిన్ న్యూస్ :** ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలో ఐక్యత సోదరభావం దాతృత్వానికి ఇఫ్తార్ విందులు చిహ్నంగా నిలుస్తాయని మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. మండపేట వైసిపి మైనార్టీ విభాగం అధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు లో చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పాల్గొన్నారు. షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా, వైసిపి మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు షేక్ గౌస్ ల నేతృత్వంలో కలువపువ్వు సెంటర్ లో ఉన్న ప్రాచీన హనీఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ లో ఈ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐదేళ్ల పాటు పట్టణ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి ను ఘనం గా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మాట్లాడుతూ హిందూ ముస్లిం లు ఇక్కడ అన్యోన్యంగా ఉంటారని పేర్కొన్నారు.ఒకరి పండుగలను మరొకరు గౌరవిస్తూ జీవనం సాగించడం మండపేట ప్రత్యేకమని చెప్పారు. తను గాంధీనగర్ అమీనా మస్జిద్ మహిళా విభాగం నిర్వహించే కార్యక్రమాల్లో తరచూ పాల్గొంటానని చెప్పారు. ముస్లిం మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. నేటి తో 25 రోజులు ఉపవాసాలు పూర్తి అయ్యాయని చెప్పారు. ముస్లిం లకు ముందస్తుగా రంజాన్ పండుగ ఈదుల్ ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా వైసిపి మైనార్టీ సెల్ టౌన్ అధ్యక్షులు షేక్ గౌస్, వైసిపి మైనార్టీ నాయకులు షేక్ సర్కార్, అర్షద్, హెచ్ ఎం టి అల్తాఫ్, కస్మూర్, ఉమర్, షేక్ మక్బుల్, షేక్ బాజీ, షేక్ ఫయాజ్,షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### పుట్ట మహేష్ కుమార్ యాదవ్ పట్టుబడటం

# రాష్ట్రానికే సిగ్గుమాలిన చర్య

**ఎంపీ పుట్టా తో సీఎం చంద్రబాబు రాజీనామా చేయించాలి : - మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నైతక బాధ్యత వహించి ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ చేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజీనామా చేయించాలని మాజీ ఎంపీ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. స్థానిక వి ఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్ లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో మార్గాని భరత్ రామ్ మాట్లాడారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఉంటూ హైదరాబాదులో జరిగిన రేవ్ పార్టీలో ఈగల్ టీం కు రెడ్ హ్యాండెడ్ గా ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ పట్టుబడటం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే సిగ్గుమాలిన చర్య అని భరత్ ఘాటుగా విమర్శించారు. చట్టసభలలో కూర్చుని చట్టాలు చేయాల్సిన వారే డ్రగ్స్, కొకైన్ వంటి అనైతిక చర్యలకు పాల్పడటం.. ఆపైన అరెస్టు కావడం ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టకే మాయని మచ్చ అని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ ఇటువంటి ప్రజా ప్రతినిధులను అందలం ఎక్కించడం ఆ పార్టీ సిద్ధాంతాలు, నీతి, నిబద్ధత ఎటువంటివో అర్థమవుతోందన్నారు. ఈగల్ టీం నిర్వహించిన పరీక్షలలో తెలంగాణ ప్రతినిధులతో పాటు మహేష్ కుమార్ యాదవ్ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లుగా స్పష్టమైశీదన్నారు. ఈ విషయంలో ఈగల్ టీం, ఇతర పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి రాజకీయ పరమైన ఒత్తిళ్లకు లొంగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని భరత్ డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రాలలో కలకలం రేకెత్తించిన ఈ సంఘటన విషయంలో కూటమి ప్రభుత్వం ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కానీ కనీసం మాత్రంగా అయినా స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం సన్నగిల్లినట్లు అర్థమవుతోందన్నారు.వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ ను టిడిపి నుంచి తొలగించాలని , అలాగే ఎంపీ పదవికి రాజీనామా చేయించాలని భరత్ డిమాండ్ చేశారు.

# సిలిండర్ల కొరత ఉందని డీలర్లు చెప్పడం ప్రజల్లో అనుమానాలు

**ఎల్పిజి కొరతపై గందర గోళం - ప్రభుత్వ వైఫల్యంపై మండిపడ్డ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధినేత మేడా శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుతం ఎల్పిజి గ్యాస్ సరఫరా విషయంలో దేశవ్యాప్తంగా ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితులపై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధినేత మేడా శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. ఒకవైపు ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి భయాందోళన అవసరం లేదని, ఎల్పిజి సిలిండర్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చెబుతుండగా, మరోవైపు అనేక ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందని డీలర్లు చెప్పడం ప్రజల్లో తీవ్ర అనుమానాలు మరియు భయాందోళనలు కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రకటనలు ఒకలా ఉండగా, స్థానికంగా జరుగుతున్న పరిస్థితులు మరోలా ఉండటం వల్ల ప్రజలు ఏది నమ్మాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని మేడా శ్రీనివాస్ విమర్శించారు. కొన్ని ఎల్పిజి డీలర్లు గ్యాస్ కొరత పేరుతో సరఫరా ఆలస్యం చేయడం, అలాగే సోషల్ మీడియా వేదికలలో కూడా కొరత ఉందని ప్రచారం జరగడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితులు కొనసాగితే సామాన్య ప్రజలు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజలకు స్పష్టమైన సమాచారం అందిస్తూ, ఎల్పిజి సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మండల సీనియర్ నాయకుల ఆత్మీయ విందులో పాల్గొన్న బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మావుళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా సీతానగరం మండల సీనియర్ నాయకులు పెందుర్తి అచ్చయ్య పెందుర్తి దాసు మరియు నీరుకొండ వెంకటేశ్వరరావు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ఆత్మీయ విందులో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేవ కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టా వెంకటేశ్వరావు ఆత్మీయ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో కొలువైయున్న మావుళ్ళమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా సీతానగరం మండలం జనసేన పార్టీ ప్రెసిడెంట్, కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మట్టా వెంకటేశ్వరావు ఇంట్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుండి ఒంటిపూట బడులు ప్రారంభం

**వేసవి వేడిమి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం - అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలు తప్పనిసరి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటిపూట బడులు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదని రాయవరం మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ తెలిపారు. ఉదయం వేళల్లోనే తరగతులు నిర్వహించి మధ్యాహ్నానికి ముందే విద్యార్థులను ఇంటికి పంపించేలా పాఠశాలల సమయాలను ఏర్పాటు చేసారన్నారు. సాధారణంగా ఉదయం 7.45 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించేలా సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్ పాఠశాలలు ఈ కొత్త సమయాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా చిన్నారులు తీవ్ర ఎండల ప్రభావానికి గురికాకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలల్లో తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వేసవి కాలం ముగిసే వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయని అధికారులు వెల్లడించారు.



# స్టార్ కిడ్ టు గ్లోబల్ ఐకాన్..

## 'వండర్ ఉమెన్' ఆలియా భట్ ఇన్‌స్పైరింగ్ జర్నీ

బాలీవుడ్ అగ్ర నటి ఆలియా భట్ నేడు 33వ పడిలోకి అడుగుపెట్టారు. 2012లో 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమాతో పరిచయమైన ఈ భామ, కేవలం పదేళ్లలోనే హాలీవుడ్ స్థాయికి చేరుకున్నారు. నటిగానే కాకుండా నిర్మాతగా, వ్యాపారవేత్తగా, ఒక బిడ్డకు తల్లిగా ఆమె ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. బాలీవుడ్ వెండితెరపై తన నటనతో, చురుకుదనంతో అనతి కాలంలోనే నంబర్ వన్ హీరోయిన్‌గా ఎదిగిన నటీమణి ఆమె. ప్రముఖ దర్శకుడు మహేష్ భట్ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ, తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆ క్యూట్ బ్యూటీ మరెవరో కాదు.. ఆలియా భట్. నేడు (మార్చి 15) ఆమె పుట్టినరోజు సందర్భంగా గంగూబాయి గురించి మరిన్ని విశేషాలు తెలుసుకుందాం..

### స్టార్ కిడ్ అనే ముద్రను చెరిపేసి..

ఆలియా భట్ సినీ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, ఆమె ఎదుగుదల వెనుక తీవ్రమైన కృషి ఉంది. తొలి సినిమా తర్వాత ఆమెపై వచ్చిన ట్రోల్స్, విమర్శలను ఆమె సవాలుగా తీసుకున్నారు. 'హైవే' సినిమాతో తనలోని నటిని ప్రపంచానికి పరిచయం చేశారు. ఆ తర్వాత వచ్చిన 'ఉడ్తా పంజాబ్', 'రాజీ' వంటి చిత్రాలు ఆమెను బాలీవుడ్ మేటి నటీమణుల సరసన నిలబెట్టాయి. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. సంజయ్ లీలా భన్సాలీ నిర్మించిన 'గంగూబాయి కతియావాడి' చిత్రంతో ఆమె నేషనల్ అవార్డును సైతం కైవసం చేసుకున్నారు. కేవలం భారతీయ సినిమాలకే పరిమితం కాకుండా, నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ 'హార్ట్ ఆఫ్ స్టోన్' ద్వారా హాలీవుడ్‌లోకి ఘనంగా అడుగుపెట్టారు. గూచీ వంటి అంతర్జాతీయ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా మారారు.

### మల్టీ టాలెంటెడ్ పర్సనాలిటీ..

ఆలియా కేవలం నటి మాత్రమే కాదు, ఆమె గొప్ప గాయని కూడా. తన సినిమాల్లోని కొన్ని పాటలను స్వయంగా పాడి మెప్పించారు. దీనికి తోడు 'ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్' పేరుతో నిర్మాణ సంస్థను స్థాపించి, 'డార్లింగ్స్' వంటి వైవిధ్యమైన సినిమాలను నిర్మిస్తున్నారు. పర్యావరణంపై మక్కువతో 'కోఎగ్జిస్ట్' వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆమె చురుగ్గా పాల్గొంటున్నారు. నటుడు రణబీర్ కపూర్‌ను వివాహం చేసుకున్న తర్వాత ఆలియా జీవితం మరింత పరిపూర్ణమైంది. ప్రస్తుతం వీరిద్దరికీ 'రాహా' అనే ముద్దుల కూతురు ఉంది. వృత్తిపరమైన బాధ్యతలు, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయడంలో ఆలియా ఎంతో పరిణతి చూపిస్తున్నారు. షూటింగ్స్ ఎంత బిజీగా ఉన్నా, తన కూతురి కోసం సమయాన్ని కేటాయించడం ఆమె ప్రత్యేకత. ప్రస్తుతం ఆలియా చేతిలో 'జిగ్రా', 'లవ్ అండ్ వార్' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రతి సినిమాతో తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ బాక్సాఫీస్ వద్ద రాణిగా వెలుగుతున్న ఆలియా భట్, మరెన్నో విజయాలు అందుకోవాలని కోరుకుంటూ విష్ యు ఏ వెరీ హ్యాపీ బర్త్‌డే!



సినీ వాయిస్ CINEMA

# ఉస్తాద్ భగత్ సింగ్ కోసం శ్రీలీల రెమ్యునరేషన్..

## ఫ్లాపుల్లో ఉన్నా అంత తీసుకుందా.!!



తెలుగు రాష్ట్రాల్లో మరోసారి పవర్ స్టార్ మేనియాతో ఊగిపోతున్నాయి. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ఉగాది కానుకా మార్చి 19న థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా సాంగ్స్, ట్రైలర్ కు అభిమానుల నుంచి ఓ రేంజ్ లో రెస్పాన్స్ వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. మార్చ్ 19న ఈ సినిమా గ్రాండ్ గా విడుదలకానుంది. గతంలో హరీష్ శంకర్ , పవన్ కళ్యాణ్ కాంబినేషన్ లో వచ్చిన గబ్బర్ సింగ్ సినిమా ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ సినిమా పై అంచనాలను భారీగా పెంచేసింది. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ మరోసారి పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. అలాగే హీరోయిన్స్ గా శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మించిన ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చారు. తమన్ బీజీఎం స్కోర్ అందించారు. ఇదిలా ఉంటే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కోసం హీరోయిన్ శ్రీలీల రెమ్యునరేషన్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. శ్రీలీల ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్ గా నటిస్తుండగా సెకండ్ హీరోయిన్ గా రాశీ ఖన్నా నటిస్తుందని తెలుస్తుంది. కాగా ఈ సినిమా కోసం శ్రీలీల ఏకంగా రూ. 2.5 నుంచి రూ. 3కోట్ల వరకు తీసుకుంటుందని తెలుస్తుంది. గతంలో శ్రీలీల జూనియర్ అనే సినిమా కోసం రూ. 4 కోట్లు తీసుకుందట. ఇక ఇప్పుడు ఉస్తాద్ కోసం కూడా ఈ అమ్మడు భారీగానేఅందుకుంటుందని తెలుస్తుంది. పెళ్లి సందడి సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఆతర్వాత ధమాకా సినిమాతో హిట్ అందుకుంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా శ్రీలీల నటించిన సినిమాలన్నీ ఫ్లాప్ అవుతూ వస్తున్నాయి. మధ్యలో బాలయ్య నటించిన భగవంత్ కేసరి సినిమా హిట్ అయినప్పటికీ అది బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇక ఇప్పుడు పవన్ కళ్యాణ్ సినిమాతో సాలిడ్ హిట్ కొట్టాలని చూస్తుంది శ్రీలీల.. ఈ సినిమా భారీ హిట్ పక్కా అంటున్నారు పవన్ కళ్యాణ్ అభిమానులు.

క్రీడా వాయిస్

# కేకేఆర్ కెప్టెన్‌గా మళ్లీ రహానే..

## అనుభవం వైపే మొగ్గు చూపిన షారుఖ్ ఖాన్ టీమ్



ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్‌రైడర్స్ సారథిగా అజింక్య రహానేను కొనసాగించనున్నారు. గాయం వల్ల హర్షిత్ రాణా ఈ సీజన్‌కు దూరం కాగా, ముస్తాఫిజుర్ స్థానంలో ముజరబానీ జట్టులోకి వచ్చాడు. జట్టు కూర్పు విషయంలో ఈసారి కేకేఆర్ చాలా పకడ్బందీగా వ్యవహరించింది. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్ క్యాంప్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పటికీ, వెటరన్ బ్యాటర్ అజింక్య రహానేపై కేకేఆర్ మేనేజ్‌మెంట్ మరోసారి నమ్మకం ఉంచింది. 37 ఏళ్ల ఈ ముంబై బ్యాటర్, ఈ ఏడాది కూడా జట్టును ముందుండి నడిపించబోతున్నాడని సమాచారం. అనుభవం దృష్ట్యా రహానేనే సరైన ఎంపిక అని ఫ్రాంచైజీ భావిస్తోంది. గత సీజన్‌లో 13 మ్యాచ్‌ల్లో 390 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచిన రహానే, ఈసారి కూడా వన్ డౌన్ (నెం.3) పొజిషన్‌లోనే బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. జట్టు కూర్పు విషయంలో ఈసారి కేకేఆర్ చాలా పకడ్బందీగా వ్యవహరించింది. ముఖ్యంగా వేలంలో న్యూజిలాండ్ స్టార్లైన ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, రచిన్ రవీంద్రలతో పాటు ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను సొంతం చేసుకుంది. వీరంతా టాప్ ఆర్డర్ బ్యాటర్లే కావడంతో ఓపెనింగ్‌లో ఎవరిని దింపాలనేది ఇప్పుడు రహానేకు పెద్ద తలనెప్పిగా మారింది. ఒకవైపు సునీల్ నరైన్ లాంటి విధ్వంసకర ఓపెనర్ ఉండగా, మరోవైపు ఈ నలుగురు విదేశీ స్టార్లలో ఎవరిని తుది జట్టులోకి తీసుకోవాలనేది ఆసక్తికరంగా మారింది. మతీషా పతిరన, రోవ్‌మన్ పావెల్ వంటి పవర్‌ఫుల్ ప్లేయర్లు కూడా రేసులో ఉన్నారు. అయితే, సీజన్ ప్రారంభానికి ముందే కేకేఆర్‌కు ఒక పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ హర్షిత్ రాణా గాయం కారణంగా ఐపీఎల్ 2026 మొత్తానికి దూరమయ్యాడు. ఫిబ్రవరిలో నవీ ముంబైలో జరిగిన టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాతో ఆడుతుండగా అతడు గాయపడ్డాడు. రూ.4 కోట్లకు రిటైన్ చేసుకున్న కీలక బౌలర్ అందుబాటులో లేకపోవడం జట్టు బౌలింగ్ విభాగంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. హర్షిత్ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కోసం మేనేజ్‌మెంట్ అన్వేషిస్తోంది. మరోవైపు, బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో జింబాబ్వే స్పీడ్‌స్టర్ బ్లెస్సింగ్ ముజరబానీని కేకేఆర్ ఒప్పందం చేసుకుంది. ముస్తాఫిజుర్‌ను రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, బీసీసీఐ సూచన మేరకు అతడిని జట్టు నుంచి తప్పించి ముజరబానీని రిప్లేస్‌మెంట్‌గా తీసుకున్నారు. దీంతో బౌలింగ్ విభాగంలో కొత్త రక్తం చేరినట్లయింది. మొత్తానికి రహానే సారథ్యంలో, కొత్త విదేశీ ఆటగాళ్ల అండతో కేకేఆర్ ఈసారి తన నాలుగో ఐపీఎల్ టైటిల్ వేటను ఎలా కొనసాగిస్తుందో చూడాలి.

# సంజూ శాంసన్ ఎంట్రీ వెనుక మాస్టర్ ప్లాన్ ఇదే..

## అసలు విషయం బయటపెట్టిన గౌతమ్ గంభీర్



టీ20 ప్రపంచకప్ 2026లో సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవడం వెనుక ఉన్న దూకుడు వ్యూహాన్ని కోచ్ గౌతమ్ గంభీర్ వివరించారు. పవర్‌ప్లేలో గరిష్ఠ విధ్వంసం సృష్టించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జియో స్టార్‌తో జరిగిన చర్చలో గంభీర్ టీమిండియా సరికొత్త బ్యాటింగ్ ఫిలాసఫీని విడమర్చి చెప్పారు. టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు సాధించిన అద్భుత విజయం వెనుక ఉన్న అసలు సిసలైన మాస్టర్ ప్లాన్‌ను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తాజాగా బయటపెట్టారు. టోర్నీ మధ్యలో సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవడం వెనుక ఉన్న కారణాలను ఆయన వివరించారు. ఈ నిర్ణయం ఏదో ఒక బౌలర్‌ను ఎదుర్కోవడానికో లేదా లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కోసమో తీసుకున్నది కాదని, కేవలం అగ్రెసివ్ బ్యాటింగ్ కోసమేనని గంభీర్ స్పష్టం చేశారు. జియో స్టార్‌తో జరిగిన చర్చలో గంభీర్ టీమిండియా సరికొత్త బ్యాటింగ్ ఫిలాసఫీని విడమర్చి చెప్పారు. భారత టాప్ ఆర్డర్‌లో ముగ్గురు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఉన్నారని, ఆ క్రమాన్ని మార్చడానికే సంజూను తెచ్చారని వస్తున్న వార్తలను గంభీర్ కొట్టిపారేశారు. "గత ఏడాదిన్నర కాలంగా మా ఆలోచన ఒక్కటే.. క్రీజులోకి వెళ్ళామా, విధ్వంసం సృష్టించామా అన్నట్లుగా ఆడాలి. పవర్‌ప్లేలో మరింత దూకుడుగా ఉండాలనే ఉద్దేశంతోనే సంజూని బరిలోకి దింపాం. నా దృష్టిలో క్వాలిటీ బ్యాటర్ ఏ రకమైన బౌలర్నైనా ఎదుర్కోగలగాలి. ఆరు ఓవర్లలోనే ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ తీయడమే మా లక్ష్యం" అని గంభీర్ చెప్పుకొచ్చారు. సంజూ శాంసన్ తనదైన రోజున మొదటి ఆరు ఓవర్లలోనే మ్యాచ్ ఫలితాన్ని మార్చేయగలడని కోచ్ ధీమా వ్యక్తం చేశారు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి టాప్-3 బ్యాటర్లు ఉండి, ఆ తర్వాత సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, శివం దూబే, అక్షర్ పటేల్ వంటి హిట్టర్లు ఉంటే అంతకంటే బలమైన బ్యాటింగ్ లైనప్ ఇంకేముంటుందని గంభీర్ ప్రశ్నించారు. అలాగే సంజూకు జట్టులో చోటు దక్కిన విషయాన్ని ఎంతో క్యాజువల్‌గా చెప్పినట్లు గంభీర్ వెల్లడించారు. జింబాబ్వే మ్యాచ్‌కు ముందు జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో.. రేపు నువ్వు ఆడుతున్నావు సంజూ అని చెబితే, సంజూ కూడా అంతే కూల్‌గా రానివ్వండి చూసుకుందాం అని బదులిచ్చినట్లు గంభీర్ గుర్తు చేసుకున్నారు. కోచ్-ప్లేయర్ లా కాకుండా ఒక స్నేహితుడిలా తాను ఆటగాళ్లతో ఉంటానని ఆయన తెలిపారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌పై వస్తున్న విమర్శలకు కూడా గంభీర్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. 2014 ఐపీఎల్‌లో వరుసగా మూడు సార్లు డకౌట్ అయిన తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తు చేస్తూ అభిషేక్ కు ధైర్యం చెప్పారు. "నువ్వు ఫామ్‌లో లేవని జనం అంటారు, కానీ నువ్వు కేవలం పరుగులు మాత్రమే చేయలేకపోతున్నావు. క్రీజులో 20-30 బంతులు ఆడితే తప్ప ఎవరి ఫామ్‌ను జడ్జ్ చేయలేం. లోకం ఏమనుకుంటుందో నీకు అనవసరం, డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న 30 మంది నీ గురించి ఏమనుకుంటున్నారనేదే ముఖ్యం. మొదటి బంతికే సిక్స్ కొట్టాలనిపిస్తే ఏమాత్రం సంకోచం లేకుండా కొట్టేయ్" అని అభిషేక్‌కు గంభీర్ పిలుపునిచ్చారు. టీమిండియా సాధించిన ఈ ప్రపంచకప్ విజయంలో ప్రతి ఆటగాడిపై మేనేజ్‌మెంట్ కు పూర్తి నమ్మకం ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com